

చంద్రబాబునాయుడును ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీభరత్, తేజస్విని. చిత్రంలో బాలకృష్ణ ఉన్నారు.

కూటమి క్లీన్ స్వీప్

జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలూ కైవసం



విజయనగరం జిల్లా పోలిపల్లి సభలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ పాల్గొన్నప్పటి చిత్రం

నాలుగు సెగ్మెంట్లలో టీడీపీ, రెండుచోట్ల జనసేన, ఒకచోట బీజేపీ అభ్యర్థుల ఘన విజయం

- మూడు దశాబ్దాల అనంతరం పూర్తిస్థాయి పట్టు సాధించిన టీడీపీ
- వైసీపీకి ఊహించని షాక్

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం జిల్లాలో కూటమి దుమ్ము రేపింది. మొత్తం క్లీన్ స్వీప్ చేసేసింది. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా నాలుగింటిలో తెలుగుదేశం పార్టీ, రెండింటిలో జనసేన, ఒకచోట బీజేపీ పోటీ చేశాయి. అన్నిచోట్ల కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించారు. అధికార పార్టీ వైసీపీ బొక్క బోర్లా పడింది.

రాష్ట్రంలో అత్యధిక ఓటర్లు కలిగిన భీమిలిలో తెలుగుదేశం అభ్యర్థి గంటా శ్రీనివాసరావు భారీ మెజారిటీతో విజయం సాధించారు. గంటా శ్రీనివాసరావుకు 1,47,081 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు 71,736 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి అడ్డాల వెంకటరామరాజు 4,297 ఓట్లు వచ్చాయి. గంటా శ్రీనివాసరావుకు 92,401 ఓట్ల మెజారిటీ లభించింది. విశాఖ తూర్పు నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మరోసారి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. వెలగపూడికి 1,29,185 ఓట్లు, సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు 59,774 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి గుత్తల శ్రీనివాస్‌కు 3,363 ఓట్లు వచ్చాయి. రామకృష్ణబాబుకు 70,877 ఓట్ల ఆధిక్యం లభించింది. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్‌కు 97,868 ఓట్లు, సమీప ప్రత్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు 33,274 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి వాసుపల్లి సంతోష్‌కుమార్‌కు 3,940 ఓట్లు వచ్చాయి. వంశీకృష్ణకు 64,594 ఓట్ల మెజారిటీ వచ్చింది.

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజుకు 1,05,278 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి కేకే రాజుకు 59,174 ఓట్లు, జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి జేడీ లక్ష్మీనారాయణకు 4,558 ఓట్లు వచ్చాయి. విష్ణుకుమార్‌రాజు 47,534 మెజారిటీతో ... మిగతా 2వ పేజీలో

భీమిలి



గంటా శ్రీనివాసరావు
మెజారిటీ : 92,401

విశాఖ తూర్పు



వెలగపూడి రామకృష్ణబాబు
మెజారిటీ : 70,877

విశాఖ పశ్చిమ



పెతకంశెట్టి గణబాబు
మెజారిటీ : 35,184

విశాఖ ఉత్తరం



పి.విష్ణుకుమార్‌రాజు
మెజారిటీ : 47,534

విశాఖ దక్షిణం



సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్
మెజారిటీ : 64,594

గాజువాక



పల్లా శ్రీనివాసరావు
మెజారిటీ : 95,235

పెందుర్తి



పంచకర్ల రమేశ్‌బాబు
మెజారిటీ : 81,870

దుమ్మురేపిన శ్రీభరత్

రాష్ట్రంలో అత్యధిక మెజారిటీ

- వైసీపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీపై 5,04,247 ఓట్ల ఆధిక్యం
- ఆమెకు లభించిన ఓట్ల కంటే టీడీపీ అభ్యర్థికి లభించిన మెజారిటీయే ఎక్కువ
- ఇరువురికీ మధ్య 36.35 శాతం ఓట్ల వ్యత్యాసం

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం పార్లమెంటు సభ్యునిగా తెలుగుదేశం అభ్యర్థి మతుకుమిల్లి శ్రీభరత్ ఘన విజయం సాధించారు. రాష్ట్రంలో ఎంపీ అభ్యర్థులందరి కంటే అత్యధిక మెజారిటీ సాధించారు. 5,04,247 ఓట్లతో వైసీపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీలక్ష్మిని ఓడించారు. విశాఖ పార్లమెంటు నియోజకవర్గంలో 13,87,125 ఓట్లు పోలవ్వగా అందులో ఆయనకు 9,07,467 ఓట్లు (65.42 శాతం) వచ్చాయి. వైసీపీ అభ్యర్థిని ఝాన్సీలక్ష్మికి కేవలం 29.07 శాతం అంటే 3,97,821 ఓట్లు లభించాయి. శ్రీభరత్‌కు లభించిన మెజారిటీ కంటే ఝాన్సీలక్ష్మికి వచ్చిన ఓట్లే తక్కువ కావడం గమనార్హం. ఇక కాంగ్రెస్ అభ్యర్థి సత్యారెడ్డికి 29,430 ఓట్లు దక్కాయి. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్‌కు కేవలం 7,529 ఓట్లు వచ్చాయి. పోలైన ఓట్లలో ఒక శాతం గాని, భరత్‌కు వచ్చిన ఓట్లలో ... మిగతా 2వ పేజీలో



విభజన హామీలు సాధిస్తాం

- అధికారం ఉందని విర్రవీగితే గుణపాఠం తప్పదని ప్రజలు తమ తీర్పు ద్వారా స్పష్టం చేశారు
- ఈ విజయం ద్వారా బాధ్యత పెరిగింది
- విశాఖ లోక్‌సభ విజేత ఎం.శ్రీభరత్

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర విభజన చట్టంలో అమలుకాకుండా మిగిలి ఉన్న హామీలన్నింటినీ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ద్వారా సాధించుకుంటామని విశాఖపట్నం లోక్‌సభ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందిన ఎం.శ్రీభరత్ తెలిపారు. కౌంటింగ్ సెంటర్‌లో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారం చేతిలో ఉంది కదా ... మిగతా 2వ పేజీలో



టీడీపీ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల జోష్



కౌంటింగ్ కేంద్రంలో ఈవీఎంల లెక్కింపు

మరిన్ని ఫొటోలు, వార్తలు 6వ పేజీలో

అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అసెంబ్లీ సెగ్మెంట్ల విజేతలు

అనకాపల్లి




కొణతాల రామకృష్ణ
మెజారిటీ: 65,764

నర్సీపట్నం



అయ్యన్నపాత్రుడు
మెజారిటీ: 24,676

మాడుగుల




బండారు సత్యనారాయణ
మెజారిటీ: 28,026

పాయకరావుపేట



వంగలపూడి అనిత
మెజారిటీ: 43,727

చోడవరం



కేఎస్ఎన్ఎస్ రాజు
మెజారిటీ: 42,189

ఎలమంచిలి



సుందరపు విజయ్‌కుమార్
మెజారిటీ: 48,956

పాడేరు



విశ్వేశ్వరరాజు
మెజారిటీ: 19,338

అరకులోయ



రేగం మత్స్యలింగం
మెజారిటీ: 31,877

వైసీపీ సిట్టింగ్‌ల పరాజయం

ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేల్లో ఒక్కరూ గెలవలేదు

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఈసారి వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలందరూ ఘోర పరాజయం పాలయ్యారు. మొత్తం 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పదమూడు చోట్ల కూటమి అభ్యర్థులు విజయం సాధించగా, అరకు, పాడేరుల్లో మాత్రం వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ముగ్గురూ మరోసారి విజయ శిఖరాలను చేరుకున్నారు. వీరిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భీమిలిలో వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై భారీ మెజారిటీతో గెలుపొందారు. తూర్పు నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణపై విజయం సాధించగా, గాజువాక నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్...టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు చేతిలో చిత్తుగా ఓటమి పాలయ్యారు. దక్షిణ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ తన సమీప ప్రత్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ (గత టీడీపీ తరపున పోటీ చేసిన తరువాత వైసీపీ పంచన చేరారు)పై 64,594 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఉత్తర నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు 60,295 ఓట్ల మెజారిటీతో వైసీపీ అభ్యర్థి కేకే రాజుపై విజయం సాధించారు. పశ్చిమ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌పై విజయం సాధించారు. పెందుర్తి నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తన ప్రత్యర్థి, జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు చేతిలో ఓటమి పాలయ్యారు. పాయకరావుపేట నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే (గత ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లా రాజాం నుంచి గెలుపొందారు) కంబాల జోగులు... టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. చోడవరంలో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్‌రాజు చేతిలో ఓటమిపాలయ్యారు.మాడుగుల నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మంత్రి బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనూరాధ... టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి చేతిలో ఓటమి పాలయ్యారు. నర్సీపట్నం నుంచి వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్..తన సమీప ప్రత్యర్థి, టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు చేతితో పరాజయం పాలయ్యారు. ఎలమంచిలిలో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కన్నబాబురాజు..కూటమి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ చేతిలో ఓడిపోయారు. అలాగే మంత్రి, మాడుగుల సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న బూడి ముత్యాలనాయుడు అనకాపల్లి నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్ చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు.



ఎంవీవీ సత్యనారాయణ



ముత్తంశెట్టి శ్రీనివాస్



వాసుపల్లి గణేశ్‌కుమార్



గుడివాడ అమర్



అదీప్‌రాజ్



బూడి ముత్యాలనాయుడు

మంత్రులు గల్లంతు

- గాజువాకలో ఓడిన అమర్‌నాథ్
- ప్రత్యర్థి పల్లాకు వచ్చిన మెజారిటీ కంటే తక్కువ ఓట్లు
- అనకాపల్లి లోక్‌సభకు పోటీచేసి ఓడిపోయిన మరో మంత్రి బూడి ముత్యాలనాయుడు
- విశాఖలో లోక్‌సభకు పోటీచేసిన మంత్రి బొత్స భార్య ఝాన్సీ, మాడుగులలో మంత్రి బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఓటమి

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):

తాజా ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు కూటమి అభ్యర్థుల చేతిలో ఘోరపరాజయం పాలయ్యారు. 2019 ఎన్నికల్లో మాడుగుల నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన బూడి ముత్యాలనాయుడు ప్రస్తుతం జగన్ కేబినెట్‌లో డిప్యూటీ సీఎంగా, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. తాజా ఎన్నికల్లో అధిష్ఠానం ఆయన్ను అనకాపల్లి నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీకి దింపింది. కూటమి తరఫున పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ చేతిలో ముత్యాలనాయుడు సుమారు 2,90,265 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. మరో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ 2019 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. జగన్ కేబినెట్‌లో చివరి రెండేళ్లలో మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తాజా ఎన్నికల్లో ఆయన్ను గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా వైసీపీ అధిష్ఠానం పోటీకి దింపగా, టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు చేతిలో ఘోరపరాజయం పాలయ్యారు. గాజువాకలో పోస్టల్ బ్యాలెట్‌లతో కలిపి మొత్తం 2,34,329 ఓట్లు పోలవ్వగా టీడీపీ అభ్యర్థి ... మిగతా 2వ పేజీలో


కుటుంబ సభ్యుల మధ్య విజయోత్సవంలో విష్ణుకుమార్‌రాజు


కృష్ణాగార్డెన్ కార్యాలయంలో సైకిల్ ప్లకార్డుతో నాయకులు, కార్యకర్తలు


51వవార్డులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకుడు సనపల.కీర్తి

కూటమి శ్రేణుల్లో విజయదరహాసం

- దక్షిణ, ఉత్తర నియోజవర్గాల్లో సంబరాలు
- టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణుల్లో ఉత్సాహం

సీతమ్మధార, జూన్ 4: ఉత్తర నియోజకవర్గంలో గెలుపొందిన బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్... సీతమ్మధారలోని ఆయన స్వగృహంలో, పార్టీ కార్యాలయంలో కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే,తెలుగుదేశం, జనసేన పార్టీల నేతలకు, కార్యకర్తలకు, అభిమానులు తన గెలుపునకు ఎంతగానో శ్రమించారన్నారు. ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చి కూడా తనకు ఓట్లు వేసిన వారందరికీ కూడా ధన్యావాదాలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

వంశీకృష్ణ విజయంపై సంబరాలు

డాబాగార్డెన్స్: గత ఐదేళ్ల వైసీపీ పాలనకు విసిగిపోయిన ప్రజలు ఈసారి ఎన్నికల్లో ఓట్ల రూపంలో కూటమికి ఘన విజయాన్ని అందించారని జీవీఎంసీ 31వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి వానపల్లి ఫణిగాయత్రికుమారి పేర్కొన్నారు. మంగళవారం వార్డులోని కృష్ణాగార్డెన్స్ పార్టీ కార్యాలయంలో కూటమి ఘన విజయాన్ని పురస్కరించుకుని సంబరాలు నిర్వహించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు సారిపల్లి మహేశ్‌తో కలిసి ఆమె కేక్ కట్ చేశారు. జై..చంద్రబాబునాయుడు... కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి అంటూ నినాదాలు చేశారు. దక్షిణ నియోజకవర్గంలోని కూటమి అభ్యర్థి వంశీకృష్ణశ్రీనివాస్ మెజారిటీతో గెలవడంతో కార్యకర్తలు, ప్రజల్లో మరింత ఉత్సాహం నింపిందన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి ఆధ్వర్యంలో పాలనతో సూపర్‌సిక్స్ పథకాలతోపాటు అనేక అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరువకానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, రాజు, ఇలియాస్, ఎస్ఎస్ఎల్ఎన్, నాని (బాక్సర్) పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: వైసీపీ నేతల ఆగడాలకు కాలంచెల్లిందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేశ్వరరావు అన్నారు. టీడీపీ విశాఖ ఎంపీగా ఎం. శ్రీభరత్, ఉత్తర నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజు గెలుపొందడంతో 44వ వార్డు పార్టీ కార్యాలయంలో విజయోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్‌కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీని ప్రజలు నమ్మే పరిస్థితిలోలేరని రుజువైందన్నారు. రైల్వేన్యూకాలనీలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకుడు అకిరెడ్డి జగదీష్ మంగళవారం కేక్ కట్ చేశారు. వార్డు అధ్యక్షుడు కన్నం వెంకటరమణరావు, కార్యదర్శి ముక్కి రామకృష్ణ, నాయకులు శ్రీకృష్ణ, తోట శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కాళ్ల గౌరీ శంకర్‌నాయుడు, రెడ్డి పుష్పలత, మళ్ల నిర్మల, గౌస్ ఖుసిందా, రాపేటి శివ, కాళ్ల శ్రీను, మోహనరావు, పందిరి పిల్లి శ్రీను, అ మ్మారావు పాల్గొన్నారు. స్థానిక ప్రధాన రహదారిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నేత గారపాటి సత్యనారాయయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నేత జాగారాపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. 44వ వార్డు తెలుగు మహిళా అధ్యక్షురాలు మళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో రామచంద్రనగర్‌లో మహిళలంతా కేక్ కట్ చేశారు. గ్రేటర్ 47వ వార్డు రాంజీ ఎస్టేట్‌లో విశాఖ పార్లమెంటరీ తెలుగు మహిళా కార్యదర్శి యాగాటి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

జ్ఞానాపురం పరిధిలో..

జ్ఞానాపురం: దక్షిణ నియోజకవర్గంలో కనీవిని ఎరుగని రీతిలో జనసేన కూటమి అభ్యర్థి వంశీకృష్ణకు అభినందనలు వెల్లువెత్తాయి. ఆయన గెలిచిన నేపథ్యంలో వార్డుల్లో కేక్‌లు కట్‌చేసి.. మిఠాయిల పంచిపెడుతూ కార్యకర్తలు, అభిమానులు హోరెత్తించారు. టీడీపీ 41వార్డు అధ్య క్షుడు ఐతిమధుబాబు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. 33వార్డులో టీడీపీ సీనియర్ నాయకులు విల్లూరి చక్రవర్తి, తిరుమలాదేవి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. 34వ వార్డులో వార్డు అధ్యక్షుడు వాసుపల్లి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు.


41వార్డులో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

వెలవెలబోయిన వైసీపీ కార్యాలయం


వైసీపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయం వద్ద కానరాని సందడి

సీతమ్మధార: ఎన్నికల్లో ఘోరంగా పరాజయం పాలవడంతో సీతమ్మధారలోని వైసీపీ కార్యాలయం వెలవెలబోయింది. ఉదయం నుంచి వెలువడిన ఫలితాల్లో కూటమి అభ్యర్థులకు మెజారిటీ రావడంతో ఒక్కొక్కరుగా జారుకున్నారు. అలాగే, నార్త్‌నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన కేకే రాజు తన కార్యాలయం నుంచి వెళ్లిపోయారు.


50వవార్డులో సనపల.వరప్రసాద్ అధ్వర్యంలో వేడుకలు

మిన్నంటిన సంబరం


ఆక్సిజన్ టవర్స్‌పై తెలుగుదేశం జెండాలు ఎగురవేస్తున్న దృశ్యం

సీతమ్మధార: కూటమి అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలుపొందడంతో సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్. లెంసమ్ అపార్టుమెంట్ 36వ అంతస్తులోని హెలిప్యాడ్‌పై అపార్టుమెంట్ వాసులంతా సంబరాలు నిర్వహించారు. టవర్స్‌లోని అన్ని ఫ్లోర్లలో టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు ఎగురవేసి, పుసుపురంగు బెలూన్స్ చేతపట్టుకుని టీడీపీ విజయంపై నినాదాలు చేశారు. అనంతరం అపార్ట్‌మెంట్ పైఫ్లోర్‌లోని హెలిప్యాడ్‌పైకి వెళ్లి టీడీపీ అభిమానులు పార్టీల జెండాలు, పసుపు రంగు బెలూన్స్‌ను గాలిలోకి విడిచిపెట్టారు. ప్రజలు మార్పు కోరుతూ కూటమిని గెలిపించారన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఎన్నికకానుండడం ఆనందదాయకమని అపార్టుమెంట్‌కు చెందిన శ్రీలత పేర్కొన్నారు.


సంబరాల్లో అపార్టుమెంట్ వాసులు

50.51 వార్డుల్లో..

మురళీనగర్; కూటమి అభ్యర్థులు సునామీలా విజయ ఢంకా మోగించారని టీడీపీ 51వవార్డు అధ్యక్షులు సనపల.కీర్తి అన్నారు. 51వవార్డు సీతన్న గార్డెన్స్‌లోని వార్డు పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఉత్తరంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన పెన్మెత్స.విష్ణుకుమార్‌రాజుని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. టీడీపీ 50 వార్డు అధ్యక్షులు సనపల.వరప్రసాద్ అధ్వర్యంలో నాయకులు కేకు కట్ చేసి పంచిపెట్టారు.



బోసిపోయిన వైసీపీ జిల్లా కార్యాలయం

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో మంగళవారం ఎండాడలోని వైసీపీ జిల్లా కార్యాలయం బోసిపోయింది. ఉదయం నుంచీ కార్యాలయానికి నేతలు, శ్రేణులు రాకపోవడంతో నిర్మానుష్యంగా కనిపించింది. - ఎండాడ

'సౌత్'లో తొలినుంచి జనసేనకే ఆధిక్యం

- అన్నిరౌండ్లల్లోనూ వైసీపీ వెనుకంజ

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గం ఓట్ల లెక్కింపులో ప్రతీరౌండ్‌లోనూ జనసేన అభ్యర్థి వంశీకృష్ణశ్రీనివాస్‌కే ఆధిక్యం కొనసాగింది. మొత్తం 17 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరిగితే ఒక్కదానిలోనూ వైసీపీ అభ్య ర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కి ఆధిక్యం దక్కకపోవడం విశేషం. ఈనెల 13న జరిగిన పో లింగ్‌లో ఈ నియోజకవర్గంలో 1,37,474 ఓట్లు పోలయ్యాయి. ఇవికాకుండా పోస్టల్ బ్యాలెట్ కింద 1,938 ఓట్లున్నాయి. దీంతో మొత్తం 1,39,339 ఓట్లను 14 టేబుళ్లపై 17 రౌండ్లలో లెక్కించారు. మొదటి రౌండ్‌లో జనసేన అభ్యర్థికి 2,519 ఓట్లు, రెండో రౌండ్‌లో 1,701 ఓట్లు,మూడో రౌండ్‌లో 4,035 ఓట్లు, నాలుగో రౌండ్‌లో 4,247 ఓట్లు, ఐదో రౌండ్‌లో 4,024 ఓట్లు, ఆరో రౌండ్‌లో 3,494 ఓట్లు, ఏడో రౌండ్‌లో 5,433 ఓట్లు, ఎనిమిదో రౌండ్‌లో 4,323 ఓట్లు, తొమ్మిదో రౌండ్‌లో 4,110 ఓట్లు, పదో రౌండ్‌లో 3,894 ఓట్లు, 11 రౌండ్‌లో 3,328 ఓట్లు, 12 రౌండ్‌లో 3,690 ఓట్లు, 13 రౌండ్‌లో 4,587 రౌండ్‌లు, 14 రౌండ్‌లో 3,970 ఓట్లు, 15 రౌండ్‌లో 4,413 ఓట్లు, 16 రౌండ్‌లో 3,804 ఓట్లు, 17 రౌండ్‌లో 3,041 ఓట్లు ఆధిక్యం లభించడంతో చివరకు 64,594 ఓట్ల మెజారిటీతో వంశీకృష్ణ శ్రీనివాస్ గెలుపొందినట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

నార్త్‌లో విష్ణుకుమార్‌రాజు ఘన విజయం

- 21 రౌండ్లలో లెక్కింపు.. తొలి నుంచి చివరి వరకు బీజేపీదే పైచేయి

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజక వర్గంలో కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన పెనుమత్స విష్ణు కుమార్ రాజు ఘన విజయం సాధించారు. బీజేపీ తరఫున పోటీ చేసిన రాజుకు 1,08,801 లభించగా, సమీప ప్రత్యర్థి వైసీపీ నుంచి పోటీ చేసిన కేకే రాజుకు 61,262 ఓట్లు పడ్డాయి. దీంతో విష్ణు కుమార్‌రాజు 47,534 ఓట్లతో విజయం సాధించారు. 21 రౌండ్లతో సాగిన కౌంటింగ్ ప్రక్రియలో తొలి రౌండ్ నుంచి విస్ణు కుమార్‌రాజు ఆధిక్యాన్ని కనబరిచారు. తొలి రౌండ్‌లో బీజేపీకి 4632, రెండో రౌండ్‌లో 5696, మూడో రౌండ్‌లో 6514, నాలుగో రౌండ్‌లో 5410, ఐదో రౌండ్‌లో 5559, ఆరో రౌండ్‌లో 5181, ఏడో రౌండ్‌లో 4649, ఎనిమిదో రౌండ్‌లో 5402, తొమ్మిదో రౌండ్‌లో 5438, పదో రౌండ్‌లో 4813, 11వ రౌండ్‌లో 5368, 12వ రౌండ్‌లో 6041, 13వ రౌండ్‌లో 4758, 14వ రౌండ్‌లో 4541, 15వ రౌండ్‌లో 5235, 16వ రౌండ్‌లో 5857, 17వ రౌండ్‌లో 5564, 18 వ రౌండ్‌లో 6537, 19వ రౌండ్‌లో 5172, 20వ రౌండ్‌లో 2911, 21వ రౌండ్‌లో 1850 ఓట్లు లభించాయి. ప్రతి రౌండ్‌లో వైసీపీ అభ్యర్థి కంటే ఎక్కువ ఓట్లు లభించడంతో విష్ణు కుమార్‌రాజు విజయం వరించింది.

తొలిసారి చట్టసభలకు నేతల ఎన్నిక

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలోని రెండు పార్లమెంట్, నాలుగు అసెంబ్లీ స్థానాలు నుంచి పలువురు అభ్యర్థులు తొలిసారి పార్లమెంట్, అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు. వీరిలో విశాఖ పార్లమెంట్ నుంచి కూటమి అభ్యర్థిగా ముతుకుమిల్లి శ్రీభరత్ తొలిసారి పార్లమెంట్‌కు ఎంపికయ్యారు. గత సార్వత్రిక ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో పరాజయంపాలైన భరత్ ఈసారి సుమారు ఐదు లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అరకు పార్లమెంట్ నుంచి గుమ్మ తనూజారాణి కూడా తొలిసారి చట్టసభలోకి అడుగుపెడుతున్నారు. విశాఖ దక్షిణ నుంచి పోటీ చేసిన సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ తొలిసారి విజయం సాధించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌పై విజయం సాధించి అసెంబ్లీలో అడుగపెట్టబోతున్నారు. అనకాపల్లి జిల్లాలోని ఎలమంచిలి నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన సుందరపు విజయ్‌కుమార్ కూడా తొలిసారి శాసనసభలోకి అడుగుపెడుతున్నారు. పాడేరు నుంచి వైసీపీ అభ్యర్థిగా విజయం సాధిం చిన మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు స్థానం నుంచి గెలుపొందిన రేగం మత్స్యలింగం తొలిసారి అసెంబ్లీలో ప్రవేశించనున్నారు.

అనకాపల్లి జిల్లాలోనూ కూటమి హవా

- ఆరు అసెంబ్లీ స్థానాలూ కైవసం
- నాలుగు స్థానాల్లో టీడీపీ, రెండుచోట్ల జనసేన ఘన విజయం
- వైసీపీకి ఊహించని షాక్

(అనకాపల్లి/విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లాలో కూటమి దుమ్ము రేపింది. మొత్తం క్లీన్ స్వీప్ చేసేసింది. జిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాల్లో నాలుగింటిలో టీడీపీ అభ్యర్థులు, రెండింటిలో జనసేన నాయకులు పోటీ చేశారు. అన్నిచోట్ల వారే మంచి మెజారిటీతో విజయం సాధించారు. అధికార పార్టీ వైసీపీ బొక్క బోర్లా పడింది. అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి సీనియర్ నాయకులు కొణతాల రామకృష్ణ జనసేన నుంచి బరిలో నిలవగా వైసీపీ నుంచి మలసాల భరత్‌కుమార్, కాంగ్రెస్ నుంచి ఐఆర్ గంగాధర్ ప్రధాన అభ్యర్థులుగా పోటీ చేశారు. ఇక్కడ మొత్తం 1,70,582 ఓట్లు పోలవ్వగా అందులో జనసేనకు 1,12,716 ఓట్లు లభించాయి. వైసీపీకి 48,387 రాగా కొణతాలకు 64,329 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి గంగాధర్‌కు కేవలం 1,835 ఓట్లు మాత్రమే లభించాయి.

- ఎలమంచిలిలో జనసేన నుంచి సుందరపు విజయకుమార్, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కన్నబాబురాజు, కాంగ్రెస్ నుంచి ఏఆర్ నరసింగరావులు పోటీ చేశారు. ఇక్కడ మొత్తం పోలైన ఓట్లు 1,77,376 కాగా సుందరపు విజయకుమార్‌కు 1,08, 254 ఓట్లు లభించగా, కన్నబాబురాజుకు 59,840 ఓట్లు వచ్చాయి. విజయకుమార్ 48,414 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థికి 1,800 ఓట్లు లభించాయి. సుందరపు విజయకుమార్ గతంలోను జనసేన తరఫున పోటీ చేసి 19 వేల పైచిలుకు ఓట్లను సాధించారు. ఇప్పుడు కూటమి అభ్యర్థిగా బరిలో నిలవడంతో టీడీపీ, బీజేపీ ఓట్లు కలిసి లక్షకు పైగా సాధించారు.

చోడవరంలో వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ధర్మశ్రీ, టీడీపీ తరఫున మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, కాంగ్రెస్ నుంచి జె.శ్రీనివాసరావు ప్రధాన అభ్యర్థులుగా నిలిచారు. ఇక్కడ 1,84,026 ఓట్లు పోలవ్వగా...కేఎస్ఎన్ఎస్ రాజు 1,09,651 ఓట్లు సాధించి, సమీప అభ్యర్థి ధర్మశ్రీపై 42,189 ఓట్ల మెజారిటీ సాధించారు. ధర్మశ్రీకి 67,462 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌కు 2,527 ఓట్లు లభించాయి.

మాడుగుల టీడీపీ అభ్యర్థిగా ఆఖరి నిమిషంలో ఖరారైన బండారు సత్యనారాయణమూర్తి 27,074 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఇక్కడ వైసీపీ నుంచి మంత్రి బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనురాధ పోటీ చేయగా, కాంగ్రెస్ నుంచి బి.శ్రీనివాసరావు బరిలో ఉన్నారు. ఇక్కడ మొత్తం 1,62,580 ఓట్లు పోలవ్వగా, బండారుకు 90,092 ఓట్లు, అనురాధకు 63,018 ఓట్లు, శ్రీనివాసరావుకు 1,760 ఓట్లు లభించాయి. పాయకరావుపేట నుంచి టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత రెండోసారి ఘన విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థిపై ఆమె 43,727 ఓట్ల మెజారిటీతో గెలిచారు.

నర్సీపట్నం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు తన సమీప ప్రత్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేశ్‌పై 23,860 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. ఇక్కడ 1,79,852 ఓట్లు పోలవ్వగా...అయ్యన్నకు 97,961 ఓట్లు లభించగా, ఉమాశంకర్‌గణేశ్‌కు 74,101 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి బి.నాగరాజుకు 1,226 ఓట్లు వచ్చాయి. పెందుర్తి నియోజకవర్గం (ఈ నియోజకవర్గంలో పెందుర్తి విశాఖ జిల్లాలో ఉండగా, పరవాడ, సబ్బవరం మండలాలు అనకాపల్లి జిల్లాలో ఉన్నాయి) నుంచి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు 77,188 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

దుమ్మురేపిన శ్రీభరత్

... 1వ పేజీ తరువాయి

ఒక శాతం గానీ ఆయన రాలేదు. ఆయనకు మొత్తం ఓట్లలో 0.55 శాతమే వచ్చాయి.

ఇక పోస్టల్ బ్యాలెట్లు 20,330 రాగా వాటిలో శ్రీభరత్‌కు 13,583, బొత్స ఝాన్సీలక్ష్మికి 5,399, సత్యారెడ్డికి 837 ఓట్లు, కేఏ పాల్‌కు 167 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలుపొందిన శ్రీభరత్ గత 2019 ఎన్నికల్లో ఇదే విశాఖ పార్లమెంటు స్థానానికి పోటీ చేశారు. అప్పుడు వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ చేతిలో 4,414 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో జనసేన తరపున పోటీ చేసిన జేడీ లక్ష్మీనారాయణకు సుమారు 2,75,000 ఓట్లు వచ్చాయి. దాంతో శ్రీభరత్ ఓడిపోయారు. ఈసారి అలా ఓట్లు చీలే అవకాశం లేకుండా జనసేన, బీజేపీలతో కలిసి పోటీ చేయడంతో భారీ మెజారిటీతో గెలిచారు. విజయం సాధించిన వార్తతో సతీసమేతంగా విజయవాడ వెళ్లి పార్టీ అధినేత చంద్రబాబునాయుడును, మామ బాలకృష్ణను కలిశారు.

విభజన హామీలు సాధిస్తాం

... 1వ పేజీ తరువాయి

అని ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని ప్రజలు తమ తీర్పు ద్వారా స్పష్టం చేశారన్నారు.

ఈ కలికాలంలో డబ్బుకు కొందరు, అధికారానికి కొందరు లొంగిపోతారని, 'సమాజం మంచిని గుర్తిస్తుందా?' అనే అనుమానం తనకు ఉండేదని, అవన్నీ పటాపంచలు చేస్తూ ప్రజలు తగిన తీర్పు ఇచ్చారన్నారు. ఎవరికీ భయపడకుండా ఓటు హక్కును ఉపయోగించుకున్నారన్నారు. విజయం వచ్చినప్పుడు ఒదిగి ఉండాలనేదే తన అభిమతన్నారు. గతంలో తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయినా ఈసారి 1.5 లక్షల నుంచి 2 లక్షల మెజారిటీతో గెలుస్తాననే నమ్మకం ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం మెజారిటీ నాలుగు లక్షలు దాటిపోయిందన్నారు. ప్రజలు ఈ విజయం ద్వారా అత్యధిక భారం పెట్టారన్నారు. వైసీపీలా తమ ప్రభుత్వం వ్యాపారులను వేధించబోదని హామీ ఇచ్చారు. విశాఖపట్నానికి రైల్వే జోన్, స్టీల్‌ప్లాంటు సమస్య పరిష్కారం, గంజాయి రవాణాను అరికట్టడం, ఉద్యోగాల కల్పన, శాంతి భద్రతల వంటి సమస్యలపై తాము ఎన్నికల సందర్భంగా మాట్లాడామని, వీటిలో కొన్నింటిని ఏడాదిలోగా సాధిస్తామని, మిగిలిన వాటిని తక్షణమే అమలు చేస్తామని చెప్పారు.

తప్పులు చేస్తే చెప్పండి

ఐదేళ్ల వైసీపీ పాలనలో మీడియాపై దాడులు జరిగాయని, వేధింపులకు గురిచేశారని, అయితే కూటమి ప్రభుత్వం దీనికి విరుద్ధమన్నారు. ప్రజలకు మేలు చేయడానికే పనిచేస్తామని, ఆ క్రమంలో ఎక్కడైనా తప్పులు జరిగితే మీడియా నిజాయితీగా ఎత్తి చూపాలని, తప్పకుండా సరిచేసుకుంటామన్నారు. కులం, మతం పేరుతో సమాజాన్ని విడదీయడం మంచిది కాదన్నారు. నిజాయితీగా పనిచేసే అధికారులను ప్రోత్సహిస్తామని, తప్పుచేసిన నాయకులకు ప్రజల తీర్పే సరైన శిక్షగా తాను భావిస్తున్నానన్నారు. ఐదేళ్లుగా కక్షపూరిత రాజకీయాలను సహించామని, అయితే ఎక్కడా లొంగిపోలేదని, తప్పులేని చోట ఎదిరించి పోరాడామని, ఇక ముందు కూడా అదే స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు.

పర్యాటక ప్రాంతంగా రుషికొండ

రుషికొండపై కేవలం ఏడు ఎకరాల్లో మాత్రమే నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయని, కానీ అంతకు మించి తవ్వేశారన్నారు. దీనిపై కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందో వేచి చూస్తామన్నారు. రుషికొండలోని కట్టడాలను పర్యాటక భవనంగానే కొనసాగించాలన్నది తన అభిమతమన్నారు. పర్యాటక రిసార్టుల్లో ఒక గది విస్తీర్ణం 300 చదరపు అడుగుల కంటే ఎక్కువగా ఉండదని, కానీ ఇక్కడ ఒక్కొక్కటి 1,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నాయని, వాటిని ఎలా ఉపయోగించుకోవాలో ఆలోచిస్తామన్నారు. దౌర్జన్యాలు చేసే ప్రభుత్వం ఉండగా ఎన్నికల్లో విజయం సాధించినా తన లాంటి వారు ఏమీ చేయలేరని, అందుకే గత ఎన్నికల్లో ఓడిపోయినందుకు పెద్దగా బాధ పడలేదన్నారు.

కూటమి క్లీన్‌స్వీప్

... 1వ పేజీ తరువాయి

కేకే రాజుపై విజయం సాధించారు.

విశాఖ పశ్చిమలో సిట్టింగ్ ఎమ్మెల్యే పి.గణబాబుకు 90,805 ఓట్లు పోలయ్యాయి. వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనందకుమార్‌కు 55,621 ఓట్లు రాగా నోటాకు 1002 ఓట్లు వచ్చాయి. గణబాబు 35,184 మెజారిటీతో హ్యాట్రిక్ విజయం సాధించారు.

గాజువాకలో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుకు 1,55,587 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు 61,529 ఓట్లు, సీపీఎం అభ్యర్థి మరడాన జగ్గునాయుడుకు 3,831 ఓట్లు వచ్చాయి. పల్లా శ్రీనివాసరావు 95,235 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు.

పెందుర్తిలో జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు 1,41,859 ఓట్లు రాగా సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు 64,671 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి భగత్‌కు 3,960 ఓట్లు వచ్చాయి. పంచకర్లకు 77,188 ఓట్ల భారీ మెజారిటీ దక్కింది. కాగా పంచకర్ల మెజారిటీ కంటే వైసీపీ అభ్యర్థి అదీప్‌రాజ్‌కు వచ్చిన ఓట్లు తక్కువ కావడం విశేషం.

కూటమిలో ఫుల్ జోష్

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు కూటమి అభ్యర్థుల్లో ఫుల్ జోష్‌ను నింపాయి. అంచనాలకు అందనంత ఘన విజయం లభించడంతో నేతలు ఉబ్బితబ్బివుతున్నారు. అధికారంలోకి వస్తామన్న గట్టి నమ్మకం ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఇన్ని స్థానాలు వస్తాయని, విశాఖలో క్లీన్‌స్వీప్ చేస్తామని ఊహించలేదంటున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీకి ఓటమి ఎదురైనా విశాఖలో నాలుగు అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంది. ఆ పార్టీకి నగరంలో పటిష్ట నాయకత్వం, కేడర్ ఉంది. దీనికి తోడు జనసేన, బీజేపీల పొత్తుతో వైసీపీని పూర్తిగా ఊడ్చి పారేసింది.

చతికిలబడిన వైసీపీ

జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలోని 1,991 పోలింగ్ బూత్‌లలోనూ వైసీపీ కనీసం ఒక్క రౌండ్‌లో కూడా మెజారిటీ సాధించలేకపోయింది. గత నెలలో పోలింగ్ ప్రక్రియ ముగిసిన తరువాత వైసీపీ జిల్లాలో ఒకటి, రెండు అసెంబ్లీ స్థానాలతో పాటు మిగిలిన ప్రాంతాల్లో అనుకూల ఫలితాలు వస్తాయని భావించింది. అయితే మంగళవారం ఉదయం చేపట్టిన ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ టీడీపీ నేతలు మంచి మెజారిటీలను సాధించడంతో వైసీపీ నేతల్లో ఒక్కసారిగా నిస్పృహ ఆవరించింది. భీమిలి నుంచి గాజువాక వరకు అన్ని నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. తెలుగుదేశం పార్టీ ఏర్పాటుచేసిన 1983, 85 తరువాత 1994లో విశాఖలో టీడీపీ క్లీన్‌స్వీప్ చేయగా, దాదాపు 30 ఏళ్ల తరువాత జిల్లాలో టీడీపీ పూర్తి స్థాయి పట్టు సాధించగలిగింది.

మంత్రులు గల్లంతు

... 1వ పేజీ తరువాయి

పల్లా శ్రీనివాసరావుకు 67 శాతం ఓట్లు (1,57,703 ఓట్లు) దక్కగా, అమర్‌నాథ్‌కు 62,468 ఓట్లు (26.6 శాతం) మాత్రమే పడ్డాయి. అమర్‌నాథ్‌కు పడిన మొత్తం ఓట్లు టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుకు వచ్చిన మెజారిటీ కంటే తక్కువ కావడం విశేషం. ఇదిలావుండగా రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ భార్య ఝాన్సీలక్ష్మి విశాఖ లోక్‌సభకు వైసీపీ నుంచి పోటీచేసి, టీడీపీ అభ్యర్థి మతుకుమిల్లి భరత్ చేతిలో 5.04 లక్షల ఓట్లు తేడాతో ఘోరపరాజయం పాలయ్యారు. రాష్ట్రంలోనే ఇది రికార్డు మెజారిటీ కావడం విశేషం. మరోవైపు మాడుగుల నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మంత్రి బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనురాధ టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి చేతిలో భారీ తేడాతో ఓటమి పాలయ్యారు.

హ్యాట్రిక్ విజయం సాధించిన గణబాబు

గోపాలపట్నం, జూన్ 4: సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు మరోసారి విజయం సాధించి హాట్రిక్ రికార్డును సొంతం చేసుకున్నారు. 2014, 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఆయన 35,184 ఓట్ల అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో మెజారిటీ స్థానాల్లో వైసీపీ హవా కనిపించినా, అప్పట్లో కూడా 'పశ్చిమ'లో మాత్రం టీడీపీ సిటింగ్ ఎమ్మెల్యే గణబాబు గెలుపొందారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకత, కూటమిపై జనాల్లో పెరిగిన నమ్మకంతో ఆయన అత్యధిక మెజారిటీతో విజయాన్ని కైవసం చేసుకున్నారు. నియోజకవర్గంలో టీడీపీకి బ లమైన కేడర్ ఉండడం, నాలుగు దశాబ్దాలుగా గణబాబు కుటుంబం రాజకీయంలోనే కొనసాగుతుండడం, ప్రత్యర్థి పార్టీలకు స్థిరమైన నాయకులు లేకపోవడం, తదితరమైనవి టీడీపీకి అను కూలమైన అంశాలుగా చెప్పవచ్చు. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో వైసీపీకి అభ్యర్థుల కొరత ఉంది. నియోజకవర్గంలో ఆదినుంచి టీడీపీకి గణబాబు పెద్దదిక్కుగా మారారు. ప్రతిసారి ఎన్నికల్లో కొత్త అభ్యర్థిని వైసీపీ నిలబెట్టడం వల్ల దిగువ స్థాయి కేడర్‌తో నాయకులు సమన్వయం చేయలేకపోవడం, గ్రూపు తగాదాలు వంటి సమస్యలతో పార్టీ పుంజుకోవడం కష్టంగా మారింది. ఇదే తెలుగుదేశం పార్టీకి మరింత బలాన్ని చేకూర్చింది. గణబాబు స్థానికుడు కావడం, గత పదేళ్లుగా నియోజకవర్గాన్ని పార్టీకి కంచుకోటలా మార్చారని చెప్పవచ్చు. పార్టీ కేడర్‌ను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతుండడంతో గణబాబు ముందు ఎవరికైనా పరాజయం తప్పడం లేదు.


రథం పై నుంచి మీసం తిప్పుతున్న రామకృష్ణబాబు

'తూర్పు' విజేత వెలగపూడి

- నాలుగో సారి గెలుపొందిన రామకృష్ణబాబు
- నియోజకవర్గం ఆవిర్భావం తర్వాత నాలుగు సార్లు ఎన్నికలు
- వరుస విజేతగా వెలగపూడి
- ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచీ ఆధిపత్యమే
- 70,877 ఓట్ల మెజారిటీతో గెలుపు


కుటుంబ సభ్యులతో వెలగపూడి రామకృష్ణబాబు విజయోత్సవ సందడి

ఎంవీపీ కాలనీ, జూన్ 4 : తూర్పు నియోజకవర్గంలో వెలగపూడి రామకృష్ణబాబు మరోసారి సత్తా చాటారు. నియోజకవర్గం ఆవిర్భావం నుంచీ ఆయన గెలుస్తూనే ఉన్నారు. నాలుగోసారి కూడా భారీ ఆధిక్యంతో గెలిచి ప్రజల్లో తనకు ఆదరణ ఉందని నిరూపించుకున్నారు. ఓట్ల లెక్కింపులో తొలి రౌండు నుంచీ ఆధిక్యత చూపించారు. మొదటి రౌండులో 3,428 ఓట్లు రావడంతో గెలుపు తప్పదన్న ధీమా వచ్చేసింది. రెండో రౌండుకు మెజారిటీ 7,549, ఆరో రౌండుకు 20,577, పదో రౌండు 34,353, పన్నెండో రౌండులో 42,564 మెజారిటీ వచ్చింది. 21 రౌండులో 65,755, పదిహేనో రౌండుకు 52,166 ఓట్ల మెజారిటీతో తనకు ఎదురులేదని మరోసారి చాటి చెప్పారు. 21వ రౌండు పూర్తయ్యే సరికి 69,411 ఓట్లతో మెజారిటీతో ఉన్నారు. వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ప్రతి రౌండులోనూ వెనకబడి ఉన్నారు. ఏ రౌండులోనూ ఆయనకు సమాంతరంగా ఓట్లు వచ్చిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ అభ్యర్థి గుత్తుల శ్రీనివాస్ నాలుగో స్థానంలో 3,430 ఓట్లతో ఉన్నారు. ఇండిపెండెంటు అభ్యర్థిని వడ్డి శిరీషా 3,508 ఓట్లతో మూడో స్థానంలో ఉన్నారు. నోటాకు 1,487 మంది ఓట్లు వేయడం గమనార్హం.

తూర్పున ఉదయించే సూర్యుడు ఒక్కడే!

తూర్పు నియోజకవర్గం 2008లో ఆవిర్భవించింది. అంతకు ముందు పెందుర్తి నియోజకవర్గంలో భాగమై ఉన్న కొంత ప్రాంతం,విశాఖ రెండో నియోజకవర్గంలోని కొంత ప్రాంతాన్ని కలిపి తూర్పు నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇప్పటివరకు నాలుగుసార్లు ఎన్నికలు జరిగాయి. నాలుగు సార్లు కూడా విజేతగా వెలగపూడి నిలిచారు. 2009లో టీడీపీ తరపున వెలగపూడి, ప్రజారాజ్యం తరపున చెన్నుబోయిన శ్రీనివాసరావు (వంశీకృష్ణ శ్రీనివాస్, ప్రస్తుతం జనసేన దక్షిణం అభ్యర్థి), కాంగ్రెస్ తరపున ఉరుకూటి అప్పారావు పోటీ చేయగా వెలగపూడి తన ప్రత్యర్థి వంశీ కృష్ణ శ్రీనివాస్‌పై నాలుగు వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున వెలగపూడి రెండోసారి పోటీ పడగా, ప్రజారాజ్యం నుంచి వైసీపీలోకి వచ్చిన వంశీకృష్ణ కూడా రెండోసారి బరిలో నిలబడ్డారు. ఈ ఎన్నికల్లో వెలగపూడికి 47,883 ఓట్ల మెజారిటీ రావడంతో రాష్ట్రంలో రికార్డుగా నిలిచింది. 2019లో జరిగిన ఎన్నికల్లో వెలగపూడిపై వైసీపీ తరపున అక్కరమాని విజయనిర్మల నిలబడ్డారు. ఆమెపై 26,474 ఓట్ల మెజారిటీతో వెలగపూడి గెలుపొంది, హ్యాట్రిక్ సాధించారు. ఇక నాలుగోసారి జరిగిన ఎన్నికల్లోనూ ఆయన వైసీపీ అభ్యర్థి ఎం.వీవీ సత్యనారాయణపై సుమారు 70 వేలకు పైగా ఓట్లతో గెలుపొందారు.

ఎంవీపీ కాలనీలో సందడే సందడి

ఎంవీపీ కాలనీ, జూన్ 4 : తూర్పు నియోజకవర్గంలో ఎటుచూసినా ప్రజలు ఆనందోత్సవాలతో కనిపించారు. ఏ టీ దుకాణం వద్ద చూసినా.. వారి మాటల్లో ఆనందం తాండవిస్తోంది. డబ్బు ఓటర్లను మార్చలేదని మాట్లాడుకోవడం కనిపించింది. కాగా వెలగపూడి నాలుగోసారి గెలుపొందడంతో సంబరాలు మిన్నంటాయి. ఎంవీపీలోని ఆదర్శనగర్‌లో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పట్టాభి ఆధ్వర్యంలో మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. విజయం తర్వాత వెలగపూడి తన కుటుంబ సభ్యులతో కాసేపు గడిపారు. కార్యాలయం వద్దకు రాత్రి సమయంలో కూడా కార్యకర్తలు చేరుకుంటున్నారు. సంబరాన్ని తర్వాత చేసుకుందాం వెళ్లిపోండంటున్నా ఎవరూ కదలకుండా అక్కడే ఉండి నినాదాలు చేశారు. దీంతో వెలగపూడి విజయం రథంపై నుంచి అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.


ఎంవీపీ కాలనీలోని ఆదర్శనగర్‌లో కేక్ కట్ చేస్తున్న మహిళా నేతలు


గంటాను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నాయకులు




గంటాకు స్వీట్ తినిపిస్తున్న భార్య శారద, తండ్రిని అభినందిస్తున్న గంటా రవితేజ

భీమిలిలో గంటా విజయ భేరి

- 92,401 ఓట్ల మెజారిటీతో గెలిచిన శ్రీనివాసరావు
- ఎమ్మెల్యేగా ఇక్కడి నుంచి రెండోసారి ఎన్నిక
- ముత్తంశెట్టికి వచ్చిన ఓట్లు 82,732

భీమునిపట్నం, జూన్ 4 : భీమిలి నియోజకవర్గం చరిత్రలో కనీవినీ ఎరుగని భారీ మెజారిటీతో కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గెలుపొందారు. మొత్తం 26 రౌండ్లలో ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యంతో కొనసాగారు. గంటాకు అత్యధికంగా 92,401 మెజారిటీ లభించింది. ఎన్నికల బరిలో మొత్తం 15 మంది అభ్యర్థులు ఉండగా, ప్రధాన పోటీ గంటా శ్రీనివాసరావు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు మధ్య సాగింది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,63,013 మంది వుండగా, 2,75,747 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.అందులో గంటా శ్రీనివాసరావుకు అత్యధికంగా 1,73,467 ఓట్లు పోలవ్వగా, ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు 82,732 ఓట్లు లభించాయి. దీంతో గంటాకు 90,735 ఓట్లు ఆధిక్యం రాగా, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో ఆ మెజారిటీ 92,401కి చేరింది. సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు మొత్తం 26 రౌండ్లలో ఎక్కడా ఆధిక్యం రాకపోవడం గమనించాల్సిన విషయం. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభంజనం భీమిలిలో కూడా స్పష్టంగా కనిపించింది. కాగా నియోజకవర్గంలో 2009లో ప్రజారాజ్యం అభ్యర్థిగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు 6,306 ఓట్ల ఆధిక్యతతో వైసీపీ అభ్యర్థిపై, 2019లో వైసీపీ అభ్యర్థిగా 9,712 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈసారి కూడా వైసీపీ అభ్యర్థిగా గెలిచి హ్యాట్రిక్ సాధించాలనుకున్నా- ఫలితాలు తారుమారయ్యాయి. అలాగే ప్రస్తుత విజేత గంటా శ్రీనివాసరావు ఇదే నియోజకవర్గంలో 2014లో టీడీపీ అభ్యర్థిగా 37,226 ఓట్ల ఆధిక్యతతో విజయం పొందారు. ఈసారి తన ఆధిక్యతను తనే తిరగరాశారు. ఇద్దరి రాజకీయ జీవితాలను పరిశీలిస్తే గంటా శ్రీనివాసరావు 2004లో రాజకీయ అరంగేట్రం చేసినప్పటి నుంచి ఇప్పటివరకూ ఏ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేసినా విజేతగా నిలుస్తున్నారు. అలాగే 2009 నుంచి అవంతి శ్రీనివాసరావు కూడా ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేసినా విజేతగానే వస్తున్నారు. ఇద్దరూ ముఖాముఖి పోటీకి తలపడడంతో ముత్తంశెట్టి ఓటమి చెందారు. పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాలతో పాటు జీవీఎంసీ వార్డుల్లో కూడా ప్రజలు కూటమి అభ్యర్థికి మద్దతుగా నిలిచారు. ఎన్నికల ప్రచార సమయంలో గంటాకు గ్రామ గ్రామాన పూలవర్షంతో ఆహ్వానం పలికి అభిమానాన్ని చాటుకున్నారు.

గంటాకు పలువురు అభినందనలు

ఎంవీపీ కాలనీలో ఉంటున్న గంటా శ్రీనివాసరావు నివాసానికి నాయకులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలి పారు. భారీ మెజారిటీతో గెలుపొందడంతో నాయకులు, బంధుమిత్రులు అభినందనలతో నివాసం సందడిగా మారింది. నేవల్ డాక్‌యార్డు కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు బి. చిరంజీవి తదితరులు గంటాను సత్కరించారు.అలాగే భారీ విజయాన్ని నమోదు చేసుకున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌ను తండ్రి రామారావు, తాత, కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు అభినందించారు. భరత్ నివాసంలో బంధుమిత్రుల అభినందనలతో సందడి నెలకొంది.

నేడు భీమిలి రాక

గంటా శ్రీనివాసరావు బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయానికి రానున్నట్టు నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఆయన బీచ్‌రోడ్‌లో వున్న కార్యాలయంలో అందుబాటులో ఉంటారని చెప్పారు.

అమనాంలో సంబరాలు

భీమునిపట్నం రూరల్ : గంటా శ్రీనివాసరావు అత్యధిక మెజార్టీతో గెలుపొందడం, రాష్ట్రంలో కూటమి ప్రభంజనంతో అమనాం గ్రామంలో తెలుగుదేశం,జనసేన, బీజేపీ కార్యకర్తలు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు చుక్క ఆదిరెడ్డి, మాజీ సర్పంచ్ దంతులూరి నృసింహ సత్యనారాయణ రాజు, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మరగడ రఘురామిరెడ్డి, నాయకులు కంబపు శివకుమార్, జనసేన నాయకులు మునకాల అనిల్‌కుమార్, కడారి మున్నా, చుక్క కొండమ్మ, బోర విజయ, చేట్ల ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

8వ వార్డులో కూటమి హవా

ఎండాడ/సాగర్‌నగర్ : జీవీఎంసీ 8వ వార్డులోని అన్ని బూత్‌ల్లోనూ గంటా సత్తా చాటారు. బూత్ నెంబర్ 332లో మొత్తం 1003 ఓట్లు పోలవ్వగా టీడీపీకి 703, వైసీపీకి 250 ఓట్లు వచ్చాయి. బూత్ నెంబర్ 333లో మొత్తం 951కి టీడీపీకి 622, వైసీపీకి 268, బూత్ నంబరు 334లో 621కి టీడీపీకి 476, వైసీపీకి 110. బూత్ నంబరు 335లో 912కి టీడీపీకి 692, వైసీపీకి 175, బూత్ నంబరు 336లో 713కి టీడీపీకి 525, వైసీపీకి 158. బూత్ నంబరు 337లో 778కి టీడీపీకి 575, వైసీపీకి 157. బూత్ నంబరు 338లో 527కి టీడీపీకి 393, వైసీపీకి 103. బూత్ నంబరు 338ఏలో 666కి టీడీపీ 503, వైసీపీకి 119. బూత్ నంబరు 339లో 536కి టీడీపీ 387, వైసీపీ 123. బూత్ నంబరు 340లో టీడీపీకి 623, వైసీపీకి 277. బూత్ నంబరు 341లో 1003కి టీడీపీకి 529, వైసీపీకి 411. బూత్ నంబరు 342లో 591కి టీడీపీకి 436, వైసీపీకి 136. బూత్ నంబరు 342ఎలో టీడీపీకి 448 పోలవ్వగా వైసీపీకి 120. బూత్ నంబరు 343లో 768కి టీడీపీకి 482, వైసీపీకి 230. బూత్ నంబరు 344లో 699కి టీడీపీకి 473, వైసీపీకి 192. బూత్ 345లో 732కి టీడీపీకి 449, వైసీపీకి 228. బూత్ నంబరు 346లో 1000కి టీడీపీకి 804, వైసీపీకి 158. బూత్ నంబరు 347లో 796కి టీడీపీకి 558, వైసీపీకి 184. బూత్ నంబరు 348లో 550కి టీడీపీకి 424, వైసీపీకి 102. బూత్ నంబరు 348ఎలో 707కి టీడీపీకి 525, వైసీపీకి 151 ఓట్లు పోలయ్యాయి. వార్డులో టీడీపీకి మొత్తం 7213 ఓట్ల మెజారిటీ లభించింది.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు


కప్పస్తంభం వద్ద ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

సింహాచలం, జూన్ 4 : ఓట్ల లెక్కింపులో తమను గెలిపించాలని కోరుతూ ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలు పార్టీల అభ్యర్థులు వరాహలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. తొలుత కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని తమ విజయాన్ని కాంక్షిస్తూ పూజలు చేశారు. అనంతరం అంతరాలయంలో స్వామివారిని దర్శించుని ప్రత్యేక పూజలు జరిపారు. తరువాత గోదాదేవి అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చనల చేసి, వేదపండితుల ఆశీస్సులు తీసుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ, విశాఖ ఎంపీ కూటమి అభ్యర్థి శ్రీభరత్, గాజువాక వైసీపీ అభ్యర్థి అమర్‌నాథ్, పెందుర్తి జనసేన అభ్యర్థి రమేష్ బాబు, చోడవరం వైసీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీ, గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ఉన్నారు.

సింహాద్రినాథునికి వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం, జూన్ 4 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా మంగళవారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ముగిసిన షిర్డీసాయి బ్రహ్మోత్సవాలు

ఆరిలోవ, జూన్ 4 : హనుమంతవాక జంక్షన్ సమీపంలోని సంజయ గాంధీ కాలనీలో వెలసిన షిర్డీ సాయిబాబా బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఈ ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే, చివరి రోజు సాయినాథుడ్ని ప్రత్యేకంగా మల్లె మాలలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం ఆలయం ఆవరణలో అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయం చైర్మన్, రిటైర్డ్ ఐపీఎస్ డీజీ రమణ కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారిణి ఉదయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో పలుచోట్ల పోలీసుల గస్తీ


సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ గోవిందరావు

ఆరిలోవ, జూన్ 4 : ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆరిలోవ ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. సిపి ఆదేశాల మేరకు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఎక్కడికక్కడ గస్తీలు నిర్వహించారు.ఆరిలోవ ఆఖరి బస్‌స్టాపు వద్ద, తోటగరువు జంక్షన్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ఇంటి సమీపంలోనూ, మేయర్ క్యాంపు కార్యాలయం సమీపంలోనూ, హనుమంతవాక జంక్షన్‌లోనూ, రవీంద్రనగర్ జంక్షన్‌లోనూ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ గోవిందరావు తెలిపారు.హనుమంతవాక సిగ్నల్ పాయింట్ వద్ద కూడా బందోబస్తు ఏర్పాటు చేశారు.

సినిమా గైడ్

- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గం గం గణేశా :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), గణేష్ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **లవ్‌మీ :** సంగం, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **రాజుయాదవ్ :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **బాక్ :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 34, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 35, క్యాబేజ్ 22, క్యారేట్ 38, దొండకాయలు 16, బంగాళా దుంపలు 27, అరటి కాయ (పె)6, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 156, బరబటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 38, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270


15వ వార్డులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


12వ వార్డు పార్టీ కార్యాలయం వద్ద సందడి వాతావరణం


పద్మనాభంలో విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

విజయోత్సాహం

- కూటమి అభ్యర్థుల గెలుపుతో మిన్నంటిన సంబరాలు
- పార్టీ కార్యాలయాల వద్ద బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ
- బంధువులు, అభిమానుల రాకతో కిటకిటలాడిన విజేతల నివాసాలు

ఆనందపురం, జూన్ 4 : మండలంలో టీడీపీ హవా కనిపించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏకంగా 11,500 ఓట్ల ఆధిక్యం లభించింది. గత ఎన్నికల్లో వైసీపీకి ఎనిమిది వేల మెజార్టీ రాగా ఇప్పుడు అదనంగా టీడీపీకి మూడు వేల మెజారిటీ వచ్చింది. మండలంలో మొత్తం 57 పోలింగ్ బూత్‌లు ఉండగా రెండు బూత్‌ల మినహా అన్నిచోట్లా టీడీపీకి ఎక్కువ శాతం ఓట్లు పడ్డాయి.

15, 16 వార్డుల్లో..

వెంకోజీపాలెం : రాష్ట్రంలో కూటమి ఘన విజయం సాధించడం పట్ల 15, 16 వార్డుల్లోని టీడీపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. విజయోత్సవ కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ, మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో 15వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ,మళ్ల రవికుమార్, అప్పన్న, 16వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నారు గోపి, మొల్లి శంకర్, వాసు, పల్లా ఉమారాణి, మొల్లి శోభ, కర్రి గౌరీ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగించడంతో తీర ప్రాంతాలలో సంబరాలు అంబరాన్నంటాయి. సాగర్‌నగర్, రుషికొండలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, చిన్నగోపి, బి. దొరబాబు, సారిపల్లి శ్రీనివాసరావు, అక్కరబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో...

పెదవాల్తేరు : అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్. నాగేశ్వరరావు ఎన్నికల్లో గెలుపొందడంతో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలో విజయం సాధించిన ఎన్‌డీయే నాయకులకు, రాష్ట్రంలోని కూటమి నాయకులకు కూడా ఆయన అభినందనలు తెలిపారు. అలాగే నగరంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. మోదీ నాలుగోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించనుండడం వల్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పాల్గొన్నారు.

గంటా గెలుపుతో ముత్యాలమ్మకు పూజలు

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు టీడీపీ నాయకుడు లండ శ్రీను సారథ్యంలో నాయకులు, కార్యకర్తలు లండగరువులోని ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, భీమిలిలో విజయం సాధించిన గంటా శ్రీనివాసరావు పేరిట పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు.

మధురవాడలో...

మధురవాడ : మధురవాడలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఆనందంలో తేలియాడుతున్నారు. ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావు, ఎంపీగా శ్రీభరత్ విజయ దుందుభి మోగించడంతో మధురవాడ, పీఎంపాలెం తదితర ప్రాంతాల్లోని నాయకులు సంబరాలు చేశారు. ఐదేళ్లుగా ప్రజలు ఎదుర్కొన్న సమస్యలకు ఇకపై పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఈనెల 9న ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారు కావడంతో మధురవాడ నాయకులు ఆ వేడుకకు వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొందరు సొంత వాహనాల్లో వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటుండగా, మరికొందరు కార్యకర్తలను తీసుకువెళ్లడానికి బస్సులు, మినీ వ్యాన్‌లు బుక్ చేస్తున్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం : మండలంలో టీడీపీకి ప్రజలు అత్యధిక మెజారిటీ ఇవ్వడం పట్ల నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. జగన్ పాలనలో అన్ని వ్యవస్థలు దెబ్బతిన్నాయని, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. ఓటు హక్కుతో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సారథ్యంలో, భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు సూచనలతో అహర్నిశలు కష్టపడి మండలంలో 8500 ఓట్లకు పైగా మెజారిటీ ఇచ్చామన్నారు. 22 పంచాయతీల్లో 21 చోట్ల ఆధిక్యం సాధించిందన్నారు. ఈ గెలుపును స్ఫూర్తిగా తీసుకొని కూటమి నాయకులందరం సమష్టిగా పనిచేసి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడానికి కృత నిశ్చయంతో పని చేస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, మాజీ ఎంపీపీ డి. గోపీబాబు, ఇతర నాయకులు పీవీ రమణ, శ్రీరామ్మూర్తి, సత్యనారాయణ, అప్పలనాయుడు, రమణ, ఎర్నాయుడు శ్రీను, ప్రసాద్, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

గంటాను కలిసిన బీజేపీ నాయకులు

మండలంలోని బీజేపీ నాయకులు భీమిలి కూటమి అభ్యర్థి గంటాను ఎంవీపీ కాలనీలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు హంస మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆరో వార్డులో...

కొమ్మాది : కూటమి విజయ దుందుభి మోగించడంతో ఆరో వార్డు నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల రాక్షస పాలనలో నలిగిపోయిన ప్రజలు కూటమికి అద్భుతమైన విజయాన్ని అందించారన్నారు. అనంతరం పీఎంపాలెం టీడీపీ నాయకుడు రంగరాజు నివాసంలో వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రమోద చక్రవర్తి, సంతోష్‌నాయుడు, రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెలగపూడికి అభినందనల వెల్లువ

ఆరిలోవ : రాష్ట్రానికి కూటమి విజయం చారిత్రక అవసరమని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు అన్నారు. మంగళవారం ఆయన తోటగరువులోని 12వ వార్డు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ఎక్కువ స్థానాల్లో గెలుపొందడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబు త్వరలోనే నాలుగో సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు నాలుగోసారి విజయం సాధించారన్నారు. అనంతరం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి వెలగపూడికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి అప్పలరాజు, పోలారావు, ఉడువాక సన్యాసిరావు, గాడి సత్యం, తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ 86వ వార్డు కార్యాలయం వద్ద డ్యాన్సులు చేస్తున్న కూటమి శ్రేణులు


కూటమి విజయం సాధించడంతో గ్రీన్ సిటీలో బాణసంచా కాలుస్తున్న దృశ్యం

రెండోసారి అసెంబ్లీకి పల్లా శ్రీనివాసరావు

వైసీపీ అభ్యర్థి, మంత్రి అమర్‌నాథ్‌పై 95,235 ఓట్ల మెజారిటీతో గెలుపొందిన టీడీపీ అభ్యర్థి

పలుచోట్ల తెలుగుదేశం పార్టీ శ్రేణుల సంబరాలు



గాజువాక, జూన్ 4: గాజువాక నియోజకవర్గం నుంచి మరోసారి విజయం సాధించి రెండోసారి పల్లా శ్రీనివాసరావు అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. 2014లో టీడీపీ 'గాజువాక' అభ్యర్థిగా ఆయన పోటీ చేసి ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి తిప్పల నాగిరెడ్డిపై 21,712 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో కూటమి తరపున టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగి 95,235 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. సమీప వైసీపీ అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌పై పోటీ చేసి పల్లా ఘన విజయం సాధించడం గమనార్హం. సౌమ్యునిగా ప్రజల్లో గుర్తింపు పొందిన పల్లా గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అపరిష్కృతంగా ఉన్న హౌస్ కమిటీ సమస్యను పరిష్కరించడంతో పాటు గంగవరం పోర్టు, ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. అలాగే ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతూ అన్ని వర్గాల వారికి చేరువయ్యారు. గాజువాక అభివృద్ధిలో కూడా తనదైన శైలిలో ముందుకు సాగి ప్రజల ఆదరాభిమానాలు పొందారు.

పదేళ్లగా ప్రజలతో మమేకమై..

ఎమ్మెల్యేగా పదవీ కాలం పూర్తయ్యాక 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిరాశ పడకుండా నిత్యం ప్రజల్లోనే ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పోరాటాలు చేశారు. ఒకపక్క టీడీపీ విశాఖ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తూనే మరోపక్క గాజువాకలోని కేడర్‌తో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ పార్టీని మరింత బలోపేతం చేశారు. ఇందుకు నిదర్శనంగా జీవీఎంసీ ఎన్నికల్లో అధికంగా కార్పొరేటర్లు గెలుపొందడాన్ని పేర్కొనవచ్చు.

కలిసొచ్చిన కులాలు, జనసేన పార్టీ

గాజువాక నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందిన పల్లా శ్రీనివాసరావుకు నియోజకవర్గంలో ఉన్న బలమైన కాపు, యాదవ, వెలమ కులాలకు జనసేన పార్టీ తోడవ్వడం కలిసొచ్చిన అంశంగా పేర్కొనవచ్చు. నియోజకవర్గంలో కాపు ఓటర్లు సుమారు 75 వేల మంది, యాదవులు 52 వేలు, వెలమలు 45 వేల మంది వరకు ఉన్నారు. దీంతోపాటు జనసేన కేడర్ కూడా గాజువాకలో అధికంగా ఉంది. అన్ని కులాల వారితో మమేకమవుతూ జనసేన కేడర్‌కు దగ్గరయ్యారు. మరోపక్క విశాఖ జిల్లాలో వైసీపీ నుంచి ఒక్క యాదవ అభ్యర్థికి కూడా టికెట్ ఇవ్వకపోవడం, గాజువాకలో టికెట్‌ను తొలుత యాదవ కులానికి చెందిన కార్పొరేటర్ ఉరుకూటి చందుకు కేటాయించి, ఆ తర్వాత కాపు సామాజిక వర్గానికి చెందిన గుడివాడ అమర్‌నాథ్‌కు కేటాయించారు. దీంతో యాదవులంతా పల్లా శ్రీనివాసరావుకు మద్దతు పలికారు.

రెండోసారి ఎమ్మెల్యేగా 'పల్లా' రికార్డు

గాజువాక నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి ఇక్కడ ఎవరు పోటీ చేసినా ఒకసారి మాత్రమే ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజకవర్గం ఏర్పాటయ్యాక 2009లో చింతలపూడి వెంకట్రామయ్య (ప్రజారాజ్యం), 2014లో పల్లా శ్రీనివాసరావు (టీడీపీ), 2019లో తిప్పల నాగిరెడ్డి (వైసీపీ) విజయం సాధించారు. ఆ తర్వాత వెంకట్రామయ్యకు ఎన్నికల్లో టిక్కెట్ లభించకపోగా, తిప్పల నాగిరెడ్డికి ఈసారి ఎన్నికల్లో వైసీపీ టిక్కెట్ ఇవ్వలేదు. అయితే పల్లా శ్రీనివాసరావు మాత్రం 2009 నుంచి వరుసగా మూడుసార్లు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడం విశేషం.

టీడీపీ శ్రేణుల సంబరాలు

కూర్మన్నపాలెం: టీడీపీ గాజువాక అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థిగా శ్రీభరత్ గెలుపొందడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. 86వ వార్డు మాతృశ్రీనగర్‌లో టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఆనందం వ్యక్తం చేస్తూ కూటమి నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు డ్యాన్సులు చేశారు. జనసేన వార్డు ఇన్‌చార్జి కాదా శ్రీను, నాయకులు బి.ఎల్లాజీ, వేగుంట శ్రీనివాస్, లోవరాజు, గణపతి, పి.మురళీమోహన్, నాగార్జున, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు. 88వ వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీలో పార్మా ఉద్యోగులు, కాలనీ వాసులు టీడీపీకి మ్యాజిక్ ఫిగర్ రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ కేక్‌లు చేసి, బాణసంచా కాల్చారు. వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు, మురళీ మోహన్, నల్ల రామారావు, శ్రీను, సునీల్, గణేశ్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ కార్యాలయంలో సంబరాల్లో పాల్గొన్న కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు


జనసేన పార్టీ విజయం సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ కోన తాతారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీరమహిళలు

బీజేపీ కార్యాలయంలో..

గాజువాక: రాష్ట్రంలో కూటమి, గాజువాకలో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు విజయం సాధించటంతో ఇక్కడి బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కేక్ కట్ చేసి, అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణంరాజు, నూకరాజు, శంకరరావు, సోంబాబు, సత్యారావు, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్టీల్ ప్లాంట్‌లో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు ఆధ్వర్యంలో విజయోత్సవాలు జరిపారు.

జనసేన పార్టీ కార్యాలయంలో..

శ్రీనగర్: జనసేన పార్టీ పోటీ చేసిన 21 స్థానాల్లో విజయం సాధించడం, పిఠాపురంలో జనసేనాని పవన్‌కల్యాణ్, గాజువాకలో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు గెలుపొందడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ ఇక్కడి జనసేన పార్టీ కార్యాలయంలో పీఏసీ సభ్యుడు కోన తాతారావు కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు గడసాల అప్పారావు, తిప్పల రమణా రెడ్డి, డి.గోవిందరెడ్డి, కనకారావు, వెంకట్రావు, చైతన్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ ఆధ్వర్యంలో 87వ వార్డులోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. 88వ వార్డులో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో, 70వ వార్డులో తెలుగు తమ్ముళ్లు కేకులు కట్ చేసి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జి చట్టి గోపి, నాయకులు శంకరరావు, బి.రమణ, రామకృష్ణ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ టీడీపీ కార్యాలయంలో..

పెదగంట్యాడ: ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఇక్కడి టీడీపీ కార్యాలయంలో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నాయకులు పి.సోమునాయుడు, ఎం.పెంటయ్య, రామురెడ్డి, ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: గాజువాకతో పాటు రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు విజయం సాధించడంతో తుంగ్లాంలో కేజీఆర్ యువసేన ఆధ్వర్యంలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కేక్ కట్ చేశారు. అలాగే హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో టీడీపీ వార్డు అధ్యక్షుడు అలమండ రాజు ఆధ్వర్యంలో మహిళలు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

గుడివాడ అమర్‌నాథ్ కొంపముంచిన వర్గ పోరు!

గాజువాక, జూన్ 4: గాజువాక నియోజకవర్గంలో వైసీపీ వర్గ పోరు ఆ పార్టీ అభ్యర్థి అమర్‌నాథ్ కొంపముంచింది. అప్పటివరకు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తిప్పల దేవన్‌రెడ్డికి టికెట్ వస్తుందని ప్రచారం జరిగినప్పటికీ ఆయన్ను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందును నియమించారు. దీంతో గాజువాక టికెట్‌ను చందుకు కేటాయిస్తారన్న ప్రచారం జరిగింది. అయినప్పటికీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్యలు టికెట్ కోసం ప్రయత్నాలు సాగించారు. అయితే టికెట్ ఆశించిన వారిలో ఎవరికీ కాకుండా చివరి నిమిషంలో గుడివాడ అమర్‌నాథ్‌కు కేటాయించారు. దీనిని మిగతా వారు జీర్ణించుకోలేకపోయారు. అప్పటి నుంచే వైసీపీలో వర్గ పోరు మొదలైంది. అసంతృప్తవాదులందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు అమర్ విశ్వప్రయత్నాలు చేశారు. దీంతో అమర్‌తో కలిసి ఆ నాయకులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పటికీ పూర్తి స్థాయితో మద్దతివ్వలేదని జోరుగా ప్రచారం జరుగుతోంది. అన్ని వార్డుల్లో వైసీపీ కేడర్‌ను బలోపేతం చేసేందుకు అమర్ ఎంతగా యత్నించినా సఫలం కాలేదు. అమర్‌నాథ్ మంత్రిగా ఉన్న సమయంలో గాజువాక వైపు కన్నెత్తి చూడలేదని, సొంత సామాజిక వర్గాన్ని సైతం దరి చేరనివ్వలేదన్న అంశాలు కూడా ఆయన ఓటమికి కొంత కారణమన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

సినిమా గైడ్

- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గం గం గణేశా :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), గణేష్ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **లవ్‌మీ :** సంగం, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **రాజుయాదవ్ :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **బాక్ :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 34, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 35, క్యాబేజీ 22, క్యారెట్ 38, దొండకాయలు 16, బంగాళదుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 156, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 38, కీరదోస 24, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 36, కంద 64, దేముడుచిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 125
ఫారం ధర	-- 145
విత్ స్కిన్	-- 260
స్కిన్‌లెస్	-- 270

కూటమి విజయంతో ఉక్కు కార్మికుల ఆనందహేల

కర్మాగారానికి మంచి రోజులు వస్తాయని ఆశిస్తున్న ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 4: రాష్ట్రంలో కూటమి భారీ విజయం సాధించడంతో ఉక్కు కార్మిక వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ మెడపై ప్రైవేటీకరణ పిడుగు ఉంది. తాము అధికారంలోకి వస్తే విశాఖ స్టీల్‌ప్లాంటును పరిరక్షిస్తామని పోటీలో చేసిన అభ్యర్థులు ప్రకటించడంతో ఉద్యోగులు, కార్మికులు కూటమికి మద్దతు పలికారు. వైసీపీ ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంభించిందని కార్మిక వర్గం పేర్కొంది. ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చిన వెంటనే టీడీపీ అభ్యర్థి అయిన పల్లా శ్రీనివాసరావు ఆమరణ నిరాహార దీక్షకు దిగడంతో ఉక్కు ఉద్యమం మరింత వేడెక్కింది. ఈ ఉద్యమానికి అప్పట్లో చంద్రబాబు విచ్చేసి మద్దతు పలికారు. స్టీల్‌ప్లాంటు అంశంపై కేంద్రంతో మాట్లాడుతామని వైసీపీ నేతల వాగ్దానాలు కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో విశాఖ విచ్చేసిన జగన్‌ను ఉక్కు కార్మిక సంఘ నాయకులు ఎయిర్‌పోర్టులో కలిసి సమస్యను వివరించారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళతానని జగన్ హామీ ఇచ్చినా అది అమలుకు నోచుకోలేదు. ఢిల్లీకి ఎన్నిమార్లు జగన్ వెళ్లినా ఉక్కు ప్రైవేటీకరణ అంశంపై మాట్లాడకపోవడం దారుణమని కార్మికులు పేర్కొంటున్నారు. అంతేకాక జీవీఎంసీ ఎన్నికల సమయంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం వైసీపీ నేతలు పాదయాత్ర చేసి కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చినా ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. కార్మిక వర్గానికి, స్టీల్‌ప్లాంటుకు వైసీపీ ద్రోహం చేసిందని భావించి కార్మికులంతా ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టారు.

రెండు నియోజకవర్గాల పరిధిలో స్టీల్‌ప్లాంట్

స్టీల్‌ప్లాంటును కాపాడుకుంటామని ఆదినుంచి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చెబుతూ వచ్చారు. ఉక్కు కర్మాగారం విశాఖ, అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో ఉంది. విశాఖ నుంచి టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, అనకాపల్లి నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్, అలాగే గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, పెందుర్తి నుంచి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు విజయం సాధించారు. ఈ రెండు నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు విజయం సాధించడం వల్ల ప్లాంట్‌కు మంచి రోజులు వస్తాయని కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి విజయంతో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ

రాష్ట్రంలో కూటమి విజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కేఎస్ఎన్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉక్కు పరిరక్షణకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, శ్రీభరత్, పల్లా శ్రీనివాసరావు మాట ఇచ్చిన ప్లాంటుకు మంచిరోజులు వస్తాయని కార్మికులంతా ఆశాభావంతో ఉన్నారని పేర్కొన్నారు.

బొర్రమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

అగనంపూడి, జూన్ 4: అగనంపూడి ఉక్కు నిర్వాసిత ప్రాంతాల ఆరాధ్య దేవత బొర్రమాంబ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించగా, పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలితా, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

'పెందుర్తి' విజేత పంచకర్ల

వైసీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌పై 81,870 ఓట్ల మెజారిటీతో గెలుపొందిన జనసేన అభ్యర్థి రమేశ్‌బాబు



పెందుర్తి, జూన్ 4: సార్వత్రిక ఎన్నికల్లో పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా జనసేన పార్టీ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు గెలుపొందారు. తొలి రౌండ్ నుంచి ఆయన ఆధిక్యత ప్రదర్శిస్తూ వచ్చిన ఆయన 81,870 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 'పెందుర్తి'లో మొత్తం 2,28,740 ఓట్లు పోలవ్వగా 22 రౌండ్లలో లెక్కింపు చేపట్టారు. మొదటి రౌండులో 9,574 ఓట్లకు గాను పంచకర్లకు 5,482, అదీప్‌రాజ్‌కు 3,583 ఓట్లు వచ్చాయి. రెండో రౌండులో 11,281 ఓట్లకు గాను పంచకర్లకు 6,633, అదీప్‌రాజ్‌కు 4,045, మూడో రౌండులో 9,771కు గాను రమేశ్‌బాబుకు 6,159, అన్నంరెడ్డికి 3,168 ఓట్లు వచ్చాయి. నాలుగో రౌండులో 7,429 ఓట్లకు గాను పంచకర్లకు 4,597, అదీప్‌రాజ్‌కు 2,487, ఐదో రౌండులో 11,938కు రమేశ్‌బాబుకు 7,816, అన్నంరెడ్డికి 3,583, ఆరో రౌండులో 11,916కు గాను పంచకర్లకు 7,921, అదీప్‌రాజ్‌కు 3,377, ఏడో రౌండులో 11,127 ఓట్లకు గాను పంచకర్లకు 6,388, అదీప్‌రాజ్‌కు 4,247 ఓట్లు వచ్చాయి. అదే విధంగా ఎనిమిదో రౌండులో 12,646 ఓట్లు రాగా, ఇందులో పంచకర్లకు 8,071, అదీప్‌రాజ్‌కు 3,841, తొమ్మిదో రౌండులో 9,541కు గాను రమేశ్‌బాబుకు 6,948, అన్నంరెడ్డికి 2,159, పదో రౌండులో 10,631 ఓట్లకు పంచకర్లకు 7,212, అదీప్‌రాజ్‌కు 2,892, 11వ రౌండులో 9,119కు గాను రమేశ్‌బాబుకు 6,444, అదీప్‌రాజ్‌కు 2,219 ఓట్లు లభించాయి. 12వ రౌండులో 9,656 ఓట్లకు గాను పంచకర్లకు 7,058, అదీప్‌రాజ్‌కు 2,078, 13వ రౌండులో 10,508కు జనసేనకు 7,293, వైసీపీకి 2,747, 14వ రౌండులో 9,552 ఓట్లకు పంచకర్లకు 6,804, అదీప్‌రాజ్‌కు 2,246, 15వ రౌండులో 10,371కు రమేశ్‌బాబుకు 7,522, అన్నంరెడ్డికి 2,341 ఓట్లు లభించాయి. 16వ రౌండులో 10,429 ఓట్లకు గాను పంచకర్లకు 7,299, అదీప్‌రాజ్‌కు 2,570, 17వ రౌండులో 11,856కు జనసేనకు 8,224, వైసీపీకి 2,981, 18వ రౌండులో 13,054 ఓట్లకు గాను పంచకర్లకు 7,592, అదీప్‌రాజ్‌కు 4,729, 19వ రౌండులో 8,977కు రమేశ్‌బాబుకు 5,587, అన్నంరెడ్డికి 2,747, 20వ రౌండులో 10,492కు పంచకర్లకు 6,054, అదీప్‌రాజ్‌కు 3,702, 21వ రౌండులో 8,908కు పంచకర్లకు 4,755, అదీప్‌రాజ్‌కు 2,979 ఓట్లు వచ్చాయి. మొత్తంమీద పంచకర్ల రమేశ్‌బాబుకు 1,49,611 ఓట్లు రాగా అదీప్‌రాజ్‌కు 67,741 ఓట్లు వచ్చాయి.

'పెందుర్తి బాద్‌షా' పంచకర్ల అంటూ కటౌట్



పెందుర్తి, జూన్ 4: పెందుర్తి నియోజకవర్గం ఏర్పడిన 46 ఏళ్లలో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ రెండోసారి పోటీ చేసిన అభ్యర్థి గెలిచిన దాఖలాలు లేవు. ఒకసారి గెలిపించిన అభ్యర్థికి రెండోసారి నో చాన్స్ అంటారు పెందుర్తి ఓటర్లు. అయితు తాజా ఎన్నికల్లో గెలుపొందిన జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు గత చరిత్రను తిరగరాశారు. పెందుర్తి ఎమ్మెల్యేగా రెండోసారి ఆయన విజయం సాధించడంతో పంచకర్లను 'పెందుర్తి బాద్‌షా' అంటూ స్థానికంగా ఆయన అభిమానులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. 2009లో పెందుర్తి నుంచి చిరంజీవి స్థాపించి ప్రజారాజ్యం పార్టీ నుంచి ఆయన పోటీ చేసి గెలవగా, ఇప్పుడు జరిగిన ఎన్నికల్లో చిరు సోదరుడు పవన్ కల్యాణ్ పార్టీ జనసేన నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించడం విశేషం. కాగా 2014లో ఎలమంచిలి నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా రమేశ్‌బాబు ఎన్నికైన సంగతి తెలిసిందే.

కూటమి నేతల సంబరాలు

పెందుర్తి ఎమ్మెల్యేగా రెండోసారి పంచకర్ల రమేశ్‌బాబు గెలుపొందడంతో కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, సంబరాలు జరుపుకున్నారు. బైక్ ర్యాలీ నిర్వహించి, బాణసంచా కాల్చారు. హలో ఏపీ.. బైబై వైసీపీ ఉంటూ ఉత్సాహంగా డ్యాన్సులు చేశారు.

ఆరంభం నుంచి గణబాబు ఆధిక్యం



గోపాలపట్నం, జూన్ 4: పశ్చిమ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి టీడీపీ అభ్యర్థి గణబాబు.. వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌పై ఆధిక్యం కొనసాగిస్తూ వచ్చారు. తొలి రౌండు లెక్కింపు పూర్తయ్యేసరికి టీడీపీకి 5,442 ఓట్లు, వైసీపీకి 3,606, రెండో రౌండులో టీడీపీకి 2,906 ఓట్లు, వైసీపీకి 5,963, మూడో రౌండులో గణబాబుకు 7,267, ఆనంద్‌కుమార్‌కు 3,984, నాలుగో రౌండులో టీడీపీకి 7,427, వైసీపీకి 3,311 ఓట్లు వచ్చాయి. ఐదో రౌండులో గణబాబుకు 5,759 ఓట్లు, ఆడారికి 2,970, ఆరో రౌండులో టీడీపీకి 6,010, వైసీపీకి 4,620, ఏడో రౌండులో టీడీపీకి 5,444, వైసీపీకి 4,014, ఎనిమిదో రౌండులో గణబాబుకు 5,593, ఆనంద్‌కుమార్‌కు 3,508, తొమ్మిదో రౌండులో టీడీపీకి 5,687, వైసీపీకి 4,172, పదో రౌండులో టీడీపీకి 5,720, వైసీపీకి 3,870 ఓట్లు పోలయ్యాయి. అదేవిధంగా 11వ రౌండులో గణబాబుకు 5,231 ఓట్లు, ఆడారికి 3,954, 12వ రౌండులో టీడీపీకి 4,196, వైసీపీకి 3,288, 13వ రౌండులో టీడీపీకి 4,429, వైసీపీకి 2,724, 14వ రౌండులో గణబాబుకు 5,369 ఓట్లు, ఆడారికి 2,546, 15వ రౌండులో టీడీపీకి 5,440, వైసీపీకి 2,500, 16వ రౌండులో టీడీపీకి 4,729, వైసీపీకి 3,025 ఓట్లు వచ్చాయి.

గణబాబుది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడంతో 28 ఏళ్లకే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో అతిపెద్ద నియోజకవర్గాల్లో రెండో స్థానంలో ఉన్న పెందుర్తి నుంచి పిన్నవయస్సులోనే అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత సుమారు పదేళ్ల పాటు ఏ పదవీ చేపట్టలేదు. అనంతరం 2014 నుంచి ఇప్పటివరకు వరుసగా మూడుసార్లు 'పశ్చిమ' ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. ఇప్పటివరకు ఆయన నాలుగుసార్లు శాసనభ్యుడిగా ఎన్నికైనా ప్రస్తుత ఎన్నికల్లో మాత్రం భారీ మెజారిటీతో గెలుపొందారు.

పశ్చిమలో నోటాకు నాలుగో స్థానం

పశ్చిమ నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు పోటీ చేశారు. వీరిలో ఎనిమిది మంది అభ్యర్థులు వివిధ పార్టీల నుంచి పోటీ చేయగా, నలుగురు ఇండిపెండెంట్లుగా బరిలో దిగారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థుల తర్వాత బీఎస్పీకి చెందిన అతుకంశెట్టి రామచంద్రరావుకు 1,157 ఓట్లు వచ్చాయి. ఈ తర్వాత నాలుగో స్థానంలో నోటాకు 1,002 ఓట్లు పోలవ్వడం విశేషం. మొత్తానికి పోటీలో ఉన్న తొమ్మిది మంది అభ్యర్థుల కంటే నోటాకే ఎక్కువ ఓట్లు రావడం గమనార్హం.

కూటమి విజయం పై సంబరాలు

మల్కాపురం: ఎన్నికల్లో కూటమి విజయఢంకా మోగించడంతో టీడీపీ, జనసేన, బీజేపీ, నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ నగర ప్రధాన కార్యదర్శి పోలిమేర శ్రీను ఆధ్వర్యంలో గాజువాక ఆర్టీసీ డిపో వద్ద కూటమి శ్రేణులు పార్టీల జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు దేవర ఈశ్వరరావు, పొట్టి మూర్తి, వి.ముత్యాలనాయుడు, పి.హరిత, కొత్తలంక భువనేశ్వరి, సత్యనారాయణ, పి.గోవిందరావు, కె.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, శివ, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: వేపగుంట, కృష్ణరాయపురంలో కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. వేపగుంటలో టీడీపీ తెదేపా నాయకుడు శేసెట్టి అప్పారావు ఆధ్వర్యంలో పార్టీల జెండాలు పట్టుకుని జై చంద్రబాబు, జై పవన్‌కల్యాణ్ అంటూ నినాదాలు చేశారు. కృష్ణరాయపురంలో టీడీపీ నాయకుడు బొబ్బర నరసింహనాయుడు ఆధ్వర్యంలో ఫ్యాన్‌ల రెక్కలు విరిచి, కింద పడేసి బైబై వైసీపీ అంటూ కేరింతలు కొట్టారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: బీజేపీ పశ్చిమ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తమ్ రమేశ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నాయకులు అశోక్‌కుమార్, చెల్లా మంజుల, నాదేండ్ల జ్యోతి, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మర్రిపాలెం వుడా కాలనీలో టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎం.వాసుదేవరావు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. వుడాకాలనీ పార్కులో మహిళలకు స్వీట్లు పంపిణీ చేశారు.

వెలవెలబోయిన వైసీపీ కార్యాలయం


ఖాళీగా ఉన్న వైసీపీ పశ్చిమ కార్యాలయం


వెలవెలబోతున్న ఎన్ఏడీ ఫ్లైఓవర్..

ఎన్.ఎ.డి జంక్షన్: జీవీఎంసీ 52వ వార్డు పరిధి మర్రిపాలెం వుడా కాలనీలో గల వైసీపీ కార్యాలయం మంగళవారం వెలవెలబోయింది. ఉదయం ఎనిమిది గంటలప్పుడు వైసీపీ పశ్చిమ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ ఇక్కడకు వచ్చి, కాసేపయ్యాక కౌంటింగ్ కేంద్రానికి వెళ్లారు. అయితే ఆ తర్వాత వైసీపీ ఫలితాలు ఆశాజనకంగా లేకపోవడంతో ఈ కార్యాలయానికి ఎవరూ రాకపోవడంతో కళ తప్పి కనిపించింది.

జనకళ తప్పిన ఎన్ఏడీ కూడలి

నిత్యం రద్దీగా ఉంగే ఎన్ఏడీ ఫ్లైఓవర్ మంగళవారం ఓట్ల లెక్కింపు కారణంగా బోసిపోయింది. అందరూ ఎన్నికల ఫలితాలను చూసేందుకు ఇళ్లకే పరిమితం కావడంతో సాయంత్రం వరకు వాహనదారుల సందడి కానరాలేదు.



ప్రభంజనం

ఏపీ తీర్పు @ 2024



నాడు తాత.. నేడు మనవడు



విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ పార్లమెంటు స్థానం నుంచి అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన ఎం.శ్రీభరత్ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. తాత ఎంవీవీఎస్ మూర్తి విశాఖ ఎంపీగా 1991, 1999 లో రెడు సార్లు విజయం సాధించారు. తిరిగి 2014లో పార్టీ అధికారంలో వచ్చిన తరువాత స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా గెలిచినా పదవిలో ఉండగానే అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. 2019లో జరిగిన ఎన్నికలో శ్రీభరత్‌కు విశాఖ ఎంపీ టిక్కెట్ ఇచ్చినా నాలుగువేల ఓట్ల తేడాతో ఓటమి చెందారు. అయినప్పటికీ నిత్యం ప్రజల్లోనే ఉంటూ, వారికి దగ్గరైన శ్రీభరత్ ప్రస్తుత ఎన్నికల్లో మరోసారి రంగంలో దిగారు. గతంలో మూర్తి ప్రాతినిధ్యం వహించిన విశాఖ పార్లమెంటు స్థానం నుంచి ఘన విజయం సాధించారు.

అభ్యర్థులు సాధించిన ఓట్ల వివరాలు...

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ నాలుగు, జనసేన రెండు, బీజేపీ ఒక స్థానంలో విజయదుందుభి మోగించారు. పోటీలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులకు దక్కిన ఓట్లు, విజేతలకు లభించిన మెజారిటీలు ఈ విధంగా ఉన్నాయి.

విశాఖ ఉత్తరం

విజేత : విష్ణుకుమార్‌రాజు (బీజేపీ)
మెజార్టీ : 46,104
మొత్తం ఓటర్లు : 2,85,789
పోలైన ఓట్లు : 1,84,743

విష్ణుకుమార్‌రాజు (బీజేపీ)..	1,05,278
కేకే రాజు (వైసీపీ)..	59,174
పెద్దాడ కనకమహాలక్ష్మి (బీఎస్పీ) :	924
లక్కరాజు రామారావు (ఐఎన్‌పీ) :	4207
గుంపుల శరత్‌బాబు.. (సమాజ్‌వాదీ పార్టీ)	392
చింతాడ సూర్యం (ఎస్‌బీఎస్ఎస్‌పీ)	228
పి. జగదీష్ ... (జేజేఎస్‌పీ) :	87
వీవీ లక్ష్మీనారాయణ.. (జేబీఎన్‌పీ) :	5085
కోనేటి వీరభద్రాచారి (ఇండి) :	74
చాపా రామునాయుడు (ఇండి) :	84
బొడ్డు శ్రీనివాస్... (ఇండి) :	104
బొర్ర రమేశ్ (ఇండి) :	78
యలమంచిలి సాహితి (ఇండి) :	112
రేణంకి చలపతిరావు (ఇండి) :	174
వడ్డి శిరీష (ఇండి):	5243
నోటా :	1120

విశాఖ దక్షిణం

విజేత : వంశీకృష్ణశ్రీనివాస్ (జనసేన)
మెజార్టీ : 64,594
మొత్తం ఓటర్లు 2,16,770
పోలైన ఓట్లు 1,39,328

వంశీకృష్ణ శ్రీనివాస్ (జనసేన)	97, 868
వాసుపల్లి గణేష్‌కుమార్ (వైసీపీ)	33, 274
వాసుపల్లి సంతోష్‌కుమార్ (కాంగ్రెస్)	3,940
కదిరి రాము (బీఎస్పీ)	932
బుర్రా శ్రీనివాసరావు (ప్రజాప్రస్థానం)	108
ఎర్రంశెట్టి. శ్రీనివాసరావు(జయభారత్)	382
గంటు దుర్గాప్రసాద్.... (భారతీయ రాష్ట్రీయదళ్)	214
రావాడ తాతారావు ... (ఎస్‌బీఎస్ఎస్‌పీ)..	232
వంశీకృష్ణకీర్తి కుమార్ బుద్ధవరపు.. (జాతీయ జనసేన పార్టీ)	551
కె. శ్రీదేవి (జై మహాభారత్)	118
సూరాడ ఎల్లాజీ (సమాజ్‌వాదీ పార్టీ)	99
కడగడ్ల ఈశ్వరరావు (ఇండి)	66
కిలపర్తి మంగరత్నం (ఇండి)	317
డోలా జగదీష్ (ఇండి)	131
తారకరామ్ లాగిశెట్టి (ఇండి)	194
బైపిన్ కుమార్‌జైన్ (ఇండి)	271
నోటా...	631

భీమునిపట్నం

విజేత : గంటా శ్రీనివాసరావు (టీడీపీ)
మెజార్టీ : 92,401
మొత్తం ఓటర్లు : 3, 63,013
పోలైన ఓట్లు : 2,75,747

గంటా శ్రీనివాసరావు (టీడీపీ)	1,73,467
ఎం. శ్రీనివాసరావు (వైసీపీ)	82,732
వెంకట వర్మరాజు (కాంగ్రెస్)	5,073
భాగం గోపాలరావు (బీఎస్పీ)	2,504
అనిల్‌కుమార్ (జై భారత్ పార్టీ)	591
హరిబాబు (రిపబ్లికన్ పార్టీ)	97
శ్రీనివాసరావు (జా.జనసేన పార్టీ)	175
చోడిపల్లి (సమాజవాది పార్టీ)	133
శరవణ్ గణేష్ శర్మ (స్వతంత్ర)	393
నాగోతు నాగమణి(స్వతంత్ర)	255
నూకల సూర్య ప్రకాష్(స్వతంత్ర)	279
నందికోళ్ళ సంధ్య(స్వతంత్ర)	163
బావిశెట్టి రమణబాబు(స్వతంత్ర)	508
బుగత రాము(స్వతంత్ర)	4002
మేకా సత్యకిరణ్(స్వతంత్ర)	482
నోటా	3028

విశాఖ పశ్చిమం

విజేత : పి.జి.వి.ఆర్.నాయుడు (గణబాబు) (టీడీపీ) మెజార్టీ : 35,184
మొత్తం ఓటర్లు: 2,13,439
పోలైన ఓట్లు: 1,51,008

పీజీవీఆర్ నాయుడు (టీడీపీ) :	90,805
ఆడారి ఆనంద్‌కుమార్ (వైసీపీ):	55,621
ఎ.రామచంద్రరావు (బీఎస్పీ):	1,157
అత్తిలి విమల (సీపీఐ):	999
బొట్టా కోటేశ్వరరావు(భారత చైతన్య యువజన పార్టీ)	137
మండపాటి శ్రీనివాసరాజు (జాతీయ జనసేన పార్టీ)	165
రవికుమార్ వెలగాడ (సమాజ్‌వాద్ పార్టీ)	69
వెంకట గణేశ్ జగ్గుమంత్రి (జైభారత్ నేషనల్ పార్టీ)	423
కొయిలాడ జగదీశ్ (ఇండి)	112
జామి పార్వతి (ఇండి)	155
పెదిరెడ్ల నానాజీ (ఇండి)	73
వి.కిరణ్‌కుమార్ (ఇండి)	135
హనుమంతు శివచాణుక్య దొర(ఇండి)	155
నోటా	1,002

విశాఖ తూర్పు

విజేత : వెలగపూడి రామకృష్ణబాబు (టీడీపీ)
మెజారిటీ : 70,877
మొత్తం ఓటర్లు : 2,92,206
పోలైన ఓట్లు : 1,99,917

రామకృష్ణబాబు (టీడీపీ)	1,32,047
సత్యనారాయణ (వైసీపీ)	61,170
శ్రీనివాసరావు (కాంగ్రెస్)	3,430
పీటర్ (బీఎస్పీ)	494
దాలిరాజు (ఎస్‌బీఎస్ఎస్)	246
కొంగరాజు (ఆర్‌పీఐ)	162
ముకుంద్ (ప్రజా ప్రస్థానం)	155
వేణుగోపాల్ (బీసీవైపీ)	92
హైమావతి (పిరమిడ్)	86
రామకృష్ణ (ఇండి)	151
ఆడాద రమణి (ఇండి)	131
భాస్కరరావు (ఇండి)	150
పద్మాకర్ యాదవ్ (ఇండి)	164
వడ్డి శిరీషా (ఇండి)	3,508
నోటా	1,508

పెందుర్తి

విజేత : పంచకర్ల రమేశ్‌బాబు (జనసేన)
మెజార్టీ : 81,870
మొత్తం ఓటర్లు : 3,07,545
పోలైన ఓట్లు : 2,28,740

పంచకర్ల రమేశ్‌బాబు (జనసేన):	1,49,611
అన్నంరెడ్డి అదీప్‌రాజ్ (వైసీపీ):	67,742
భగత్ పిరిడి (కాంగ్రెస్):	4,224
బంగారి రమణ (బీఎస్పీ):	1,308
పెడిచెట్టి రమేశ్(నవరంగ్ కాంగ్రెస్):	944
మహేదేవ్ (జైభారత్):	763
వద్దాది ఉదయ్‌కుమార్ (ఇండి):	547
ఈత రోజా (పిరమిడ్ పార్టీ):	372
గుంటూరు వెంకట నరసింహరావు (ఇండి)	335
అప్పలనాయుడు (ఇండి):	316
బోలెం మోహన్ (ఇండి):	302
కె.నన్నాసిరావు (ఇండి):	288
ఆడారి నాగరాజు (ఇండి):	235
ఏలూరు వెంకటరమణ (జనశక్తి)	324
నోటా (చెల్లనవి)	2,834

గాజువాక

విజేత : పల్లా శ్రీనివాసరావు (టీడీపీ)
మెజార్టీ : 95,235
మొత్తం ఓటర్లు: 3,33,611
పోలైన ఓట్లు: 2,32,938

పల్లా శ్రీనివాసరావు (టీడీపీ):	1,57,703
గుడివాడ అమర్‌నాథ్ (వైసీపీ):	62,468
ఎం.జగ్గునాయుడు (సీపీఎం):	3,970
కేఏ పాల్ (ప్రజాశాంతి పార్టీ):	1,700
ఎస్.అప్పారావు (బీఎస్పీ):	1,134
టి.అక్కయ్య (లోక తంత్రిక్ జనతాదళ్):	537
శామ్యూల్ జాన్ ధర్మారాజు రాయపాటి (దళిత బహుజన):	106
తలపుల శైల (ప్రజాప్రస్థానం):	122
కాంద్రేగుల ఆదినారాయణ (జై మహాభారత్):	180
బత్తుల నీలకంఠం (నవభారత్ నిర్మాణ సేవ):	127
ఎస్.సారజ్యోతి (నవతరం పార్టీ):	138
సిమకుర్తి శ్రీనివాసరావు (ఇండి):	177
కొవిరి కృష్ణ (ఇండి):	133
కాకర్లమూడి కృష్ణప్రదీప్ (ఇండి):	4,316
నోటా	1,518

ఫుల్ జోష్



సిరిపురం జంక్షన్ వద్ద మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకుంటున్న సీబీఎన్ మహిళా సైన్యం



టీడీపీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం



గంటా శ్రీనివాసరావుకు మిఠాయి తినిపిస్తున్న మహిళా నేతలు



టీడీపీ కార్యాలయంలో ఫలితాలను వీక్షిస్తున్న పార్టీ నాయకులు, శ్రేణులు



కూటమి విజయంతో నృత్యాలు చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, నేతలు

టీడీపీ కార్యాలయం వద్ద సంబరాలు

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించడంతో టీడీపీ కార్యాలయం వద్ద సంబరాలు అంబరాన్ని తాకాయి. కార్యాలయంలో స్క్రీన్ ఏర్పాటు చేసి ఓట్ల లెక్కింపును పరిశీలించారు. ఎమ్మెల్సీ చిరంజీవిరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఉదయం నుంచీ కార్యాలయంలోనే ఉన్నారు. ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌కు కూటమి అభ్యర్థుల మెజారిటీ పెరుగుతుండడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది. సాయంత్రం ఐదు గంటలకు కూటమి అభ్యర్థులంతా భారీమెజారిటీతో గెలుపొందడం ఖాయమని తేలిపోవడంతో టీడీపీ శ్రేణులంతా దసపల్లాహిల్స్‌లోని పార్టీ కార్యాలయానికి తరలివెళ్లారు. అక్కడ నృత్యాలు చేస్తూ, ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఆనందాన్ని పంచుకున్నారు. భీమిలిలో గంటా శ్రీనివాసరావు భారీ మెజారిటీతో గెలుపొందడంతో అతని ఇంటివద్ద పార్టీ కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేశారు. దక్షిణ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీచేసి భారీ మెజారిటీతో గెలుపొందిన వంశీకృష్ణ శ్రీనివాస్ క్యాంప్‌కార్యాలయంలో సంబరాలు జరిగాయి. తెలుగు మహిళలు సిరిపురం కూడలిలో విజయోత్సవం నిర్వహించారు.



సంపత్‌వినాయగర్ ఆలయంలో శ్రీభరత్ పూజలు



కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజుతో శ్రీభరత్



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న గంటా శ్రీనివాసరావు



శ్రీభరత్ తరఫున ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సుమన్



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పల్లా శ్రీనివాసరావు



ధ్రువీరకరణ పత్రం అందుకుంటున్న పంచకర్ల రమేష్‌బాబు



కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్



కౌంటింగ్ సందర్భంగా ఏజెంట్లకు ఓట్లు చూపిస్తున్న సిబ్బంది



కౌంటింగ్ కేంద్రంలో సందడి

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ మంగళవారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగింది. కలెక్టర్ మల్లికార్జున ఉదయం నుంచి ప్రక్రియను నిశితంగా పరిశీలించారు.

– విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది



ఆర్వో నుంచి ఎన్నిక ధ్రువపత్రం అందుకుంటున్న వెలగపూడి

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం

తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీలో, జూన్ 4: చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టికేంద్రీకరిస్తుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. మరోసారి తనను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ దుర్మార్గపు పాలనను అంతమొందించడానికి ప్రజలు నడుం కట్టారన్నారు. గతంలో చంద్రబాబు పాలన రాష్ట్ర ప్రజలు చూశారని, ఇప్పుడు అలాంటి అభివృద్ధిని మరోసారి కోరుకున్నారన్నారు. తూర్పు నియోజకవర్గం తనకు ఇల్లు వంటిదని, అభివృద్ధి చేసి చూపించడం తనకు తెలుసన్నారు. ముఖ్యంగా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దృష్టిసారిస్తామని తెలిపారు. కొన్ని వార్డుల్లో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ముందుగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ఆర్వో నుంచి ఎన్నిక ధ్రువపత్రం అందుకుంటున్న గణబాబు

రాష్ట్రాన్ని గాడిన పెట్టేది చంద్రబాబే

'పశ్చిమ' ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, జూన్ 4: వైసీపీ పాలనలో రాష్ట్రం అథోగతిపాలైందని, ఇటువంటి రాష్ట్రాన్ని గాడిలో పెట్టి మంచి భవిష్యత్తు తీసుకువచ్చే సమర్థవంతమైన నేత చంద్రబాబేనని ప్రజలు విశ్వసించి కూటమిని గెలిపించారని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్లే రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు పూర్తిగా నాశనమైందని, పీఎం మోదీ సహకారంతో టీడీపీ, జనసేన నాయకత్వంలో రాష్ట్రాన్ని ముందుకు నడిపించే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వరుసగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించిన గణబాబు కౌంటింగ్ ముగిశాక ఎన్నికల కేంద్రం నుంచి బయటకు వచ్చి ప్రజలకు అభివాదం చేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1995లో జెడ్పీటీసీగా ఎన్నికై రాజకీయాల్లోకి వచ్చానని, 1999 నుంచి ఇప్పటివరకు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎన్నికలు జరగడం చూశామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడం ఎంతో కీలకమని, అటువంటి ఓటు హక్కును ఎంతోమంది ప్రజలు వినియోగించుకోకుండా వాటిని వైసీపీ ప్రభుత్వం తొలగించిందన్నారు. తనను గెలిపించిన ప్రజలకు గణబాబు కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్వో నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న విష్ణుకుమార్‌రాజు

ఉత్తర నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

విజేత పెనుమత్స విష్ణుకుమార్‌రాజు

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని, గంజాయి బ్యాచ్ రెచ్చిపోతోందని, రౌడీయిజం పెరిగిందని, దొంగతనాలు అధికమయ్యాయని, వీటిపై దృష్టి సారిస్తామని కూటమి అభ్యర్థిగా విజయం సాధించిన పెనుమత్స విష్ణుకుమార్ రాజు అన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతిభద్రతలను నెలకొల్పి, ప్రశాంత వాతావరణాన్ని తీసుకువస్తామన్నారు. జగన్ నియంతృత్వ పోకడలతోనే ఆ పార్టీకి ఘోర పరాభవం ఎదురయిందన్నారు. రాష్ట్రంలో జగన్ అరాచక పాలనపై నాలుగున్నరేళ్ల కిందటే పోరాటం ప్రారంభించానన్నారు. దుర్మార్గపాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించాలనే మూడుపార్టీలు అద్భుత విజయాన్ని సాధించాయన్నారు. ప్రపంచ చరిత్రలోనే ఐదేళ్లలో ఓ పార్టీ ఇంతలా పతనమవడం ఎక్కడా జరగలేదన్నారు. ఇప్పటికీ వైసీపీలో ఉన్న వారు ఆలోచించుకుని, ఆ పార్టీని వీడాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తొలగిస్తామన్నారు. అద్భుత విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఆర్వో నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న విష్ణుకుమార్‌రాజు

ప్రజల రుణం తీర్చుకుంటా

దక్షిణ విజేత వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ప్రజల రుణం తీర్చుకుంటానని కూటమి విజేత వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌లను అభిమానించి తనకు భారీ మెజారిటీ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఏకపక్ష నిర్ణయంతో ప్రజలు వైసీపీకి చెంపదెబ్బకొట్టారన్నారు. మంచివారికి ద్రోహం చేసి, ద్రోహులను దగ్గరపెట్టుకున్న జగన్‌కు తగినశాస్తి తప్పదని తాను పార్టీ నుంచి వచ్చినపుడే చెప్పానని, ఇప్పుడు అదే జరిగిందన్నారు. వైసీపీలో ఉండి విర్రవీగిన కామరాజు, కాత్రాజు, భత్రాజుల అక్రమాలను త్వరలోనే బయటపెడతానన్నారు. టైక్యూన్ హోటల్ జంక్షన్ వద్ద రోడ్డుని ఓపెన్‌చేయడంతోపాటు సీబీసీఎన్‌సీ, హయగ్రీవ భూముల పనికూడా పడతామన్నారు. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించి కూటమి ప్రభుత్వం చిరకాలం కొనసాగేలా ప్రజలను మెప్పించేందుకు కృషి చేస్తామన్నారు.